


epaper. aksharakalam. com

# అక్షరకలం

తెలుగు దినపత్రిక

aksharakalam@gmail.com

సంపుటి : 19 సంచిక : 76 | 30-05-2026 శనివారం | ఎడిటర్ : పిట్టల రామకృష్ణ | నల్లగొండ Published from Nalgonda, circulated throughout Telangana state | పేజీలు : 8 వెల : రూ.1.00



## అక్రమ వలసదారులకు మమత చేయూత

**తృణమూల్ నేతలో ఊతకర్ర అందించిన వైనం**

**సరిహద్దు వెంట అక్రమ వలసదారులు పరుగు**

మమతా బెనర్జీ కాలం నాటి అక్రమాలు తన్నుకు వస్తున్నాయి. ముఖ్యంగా బంగాదేశ్ చొరబాటు దారులను ఎలా కాపాడారో కూడా అర్థం అవుతోంది. అలాగే చొరబాటు దారులకు గేట్లు బార్లా తెరిచారు. ఈ విషయం ఇప్పుడు కళ్లకు కనపడుతోంది. పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బంగ్లాదేశీ అక్రమ వలసదారుల కంటిమీద కునుకు లేకుండా పోయింది. అరెస్ట్‌ల భయంతో అక్రమ వలసదారులు అల్లాడిపోతున్నారు. ఈ నేపథ్యంలోనే నిత్యం వందల మంది సరిహద్దు ప్రాంతాలు, ఇండియా నుంచి బంగ్లాదేశ్‌కు వెళ్లే మార్గాలకు చేరుకుంటున్నారు.

2



## సెక్స్ వర్కర్లపై దాడులు సరికాదు

**వారు కూడా మనుషులే అని గుర్తించాలి**

**లైంగిక వృత్తిలో ఉన్నవారికి ఆధార్ కార్డులు ఇవ్వాలి**

**సుప్రీం కోర్టు స్పష్టీకరణ**

స్వచ్ఛందంగా ప్రాస్టిట్యూషన్‌ను ఎంచుకోవడం, మానవ అక్రమ రవాణా బారినపడి సెక్స్ వర్క్‌లోకి దిగడం మధ్య స్పష్టమైన తేడా ఉందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఇష్టపూర్వకంగా సెక్స్ వర్క్ చేసే వయోజనులను వేధించవద్దని పోలీసులకు ఆదేశాలు జారీ చేసింది. సెక్స్ వర్కర్లకు చట్టపరంగా సమాన రక్షణ ఉండాలని పేర్కొంది. దాడుల సమయంలో వారి గుర్తింపును వెల్లడించొద్దని మీడియాకు కూడా వార్నింగ్ ఇచ్చింది. దేశంలో మానవ అక్రమ రవాణాను అరికట్టేందుకు సమగ్ర మార్గదర్శకాలు జారీ చేసింది.

2




## నీట్ పేపర్ లీక్ బాధ్యత ఎవరిది

**యూపిపిఎస్‌సిని చూసి నేర్చుకోండి**

**విద్యార్థులు, వారి తల్లిదండ్రుల ఆందోళనకు బాధ్యులెవరు**

**నీట్ పేపర్ లీక్‌పై మరోమారు సుప్రీం ఆగ్రహం**

2

# తెలంగాణలో అంచనాను మించి ధాన్యం ఉత్పత్తి

- అయిన ఆ చివరి గింజ వరకు కొంటూనే ఉన్నాం
- తడిసిన ధాన్యం సైతం కొని రైతులను ఆదుకున్నాం
- అదనపు కొనుగోళ్లకు రూ.16,479 కోట్లు ఖర్చు చేశాం
- మీడియా సమావేశంలో మంత్రులు వెల్లడి



2 లో..



దేశంలోనే అత్యధికంగా ధాన్యం కొనుగోలు చేస్తున్న రాష్ట్రం తెలంగాణ అని ఈ మాట కేంద్రమే చెప్పిందని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. గతంలో పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కొనుగోళ్ల కంటే ఇప్పుడు ఎక్కువ కొంటున్నాం అన్నారు. సహచర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్‌తో కలిసి ఉత్తమ్ కుమార్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ విధానాలు పాటిస్తూ చెప్పిన దానికంటే అదనంగా కొనుగోలు చేశాం అన్నారు. . దీనికోసం రూ.16,479 కోట్లు ఖర్చు చేశాం. రాష్ట్రంలో చివరి గింజ వరకు కొనుగోలు చేసే బాధ్యత మాది అని ఉత్తమ్ తెలిపారు. ధాన్యం సేకరణకు క్షేత్రస్థాయిలో 13వేల వాహనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. 2 లక్షల మంది సిబ్బంది సేకరణలో పాల్గొంటున్నారని చెప్పారు. సేకరణ కేంద్రాలకు 20.86 కోట్ల గన్నీ బ్యాగులు పంపామన్నారు.

## రాష్ట్ర ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం

**జూన్ 2న అపాయింటెడ్ డేట్‌ను ప్రకటించాలి**

**31న కార్మికులందరూ డిమాండ్ డేను పాటించాలి**

**కార్మికులకు ఆర్టీసీ జేఏసీ నాయకులు పిలుపు**

హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం కోసం జూన్ 2న అపాయింటెడ్ డేట్‌ను ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 31న కార్మికులందరూ డిమాండ్ డేను పాటించాలని ఆర్టీసీ జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో జేఏసీ నాయకులు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న, వైస్ ఛైర్మన్ ఎం.థామస్ రెడ్డి, కో-కన్వీనర్ బి.యాదగిరి మాట్లాడారు. గత ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేయటానికి చర్యలు చేపట్టి శాసనసభలో బిల్లు కూడా పాస్ చేసిందని గుర్తు చేశారు. కేవలం విలీన తేదీని ప్రకటించాల్సిన సమయంలో ప్రభుత్వాలు మారాయని తెలిపారు. ఇటీవల ఆర్టీసీ సమ్మె సందర్భంగా మంత్రులతో



కూడిన ఉపసంఘం ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయటానికి అధికారికంగా ప్రకటన చేశారని తెలిపారు. ఇటీవల విలీనం కంటే ముందు ఎన్నికలు నిర్వహిస్తామని ప్రభుత్వం ప్రకటించటంతో కార్మికుల్లో తీవ్ర గందరగోళం నెలకొన్నదని అన్నారు. ఆర్టీసీ విలీనానికి అపాయింటెడ్ తేదీని తెలంగాణ ఆవిర్భావ దినమైన జూన్ 2న ముఖ్యమంత్రి ప్రకటించాలని కోరుతూ మే 31 న సింగిల్ డిమాండ్ పై రాష్ట్ర వ్యాప్తంగా అన్ని డిపో, యూనిట్లలో ఎర్ర బ్యాడ్జీలు ధరించి డిమాండ్ డే పాటించాలని పిలుపునిచ్చారు.

## ఉచిత కరెంట్ ఎగవేసే పన్నాగం



రైతులకు 24 గంటల కరెంట్ అవసరం లేదు. 3 గంటల కరెంట్ చాలని ఈఆర్‌సీ ఎదుట కాంగ్రెస్ నేత, రైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే , అసెంబ్లీ ఫ్లోర్ లీడర్ హరీష్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నాయకుడు వ్యాఖ్యలు రేవంత్ ప్రభుత్వ రైతు వ్యతిరేక ముఖాన్ని బట్టబయలు చేశాయని పేర్కొన్నారు.

వార్త 2లో



## మాజీమంత్రి గాదె వెంకట్‌రెడ్డి కన్నుమూత

హైదరాబాద్,

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి, సీనియర్ రాజకీయ నాయకుడు గాదె వెంకటరెడ్డి కన్ను మూశారు. గతకొద్ది రోజులుగా వయోభారం, ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతోన్న ఆయన శుక్రవారం హైదరాబాద్‌లోని నివాసంలో తుదిశ్వాస విడిచారు. వెంకటరెడ్డి మృతిని ఆయన కుటుంబ సభ్యులు ధృవీకరించారు. వెంకటరెడ్డి మరణంపై పలువురు రాజకీయ నాయకులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు.

## మహనీయుల విగ్రహాల ఏర్పాటులో ఇబ్బందులు

**అధికారులతో సమీక్షించిన మంత్రి అడ్లూరి**

హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి



మహనీయుల విగ్రహాల ప్రతిష్ఠాపనకు సంబంధించిన సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఉన్నతాధికారులను మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లో మహనీయుల విగ్రహాల ఏర్పాటుకు ఎదురవుతున్న ఇబ్బందులపై మంత్రి అడ్లూరి లక్ష్మణ్ అధ్యక్షతన ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ.. విగ్రహాల ఏర్పాటులో అధికారులు, పోలీసులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. నియమాలకు విరుద్ధమైన స్థలాలపై ముందుగానే నోటీసులు జారీ చేయాలని స్పష్టం చేశారు. చివరి నిమిషంలో అభ్యంతరాలు చెప్పొద్దని అధికారులకు మంత్రి సూచించారు.



## కాజీపేట రైల్వే మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్

**200 ఇంటర్ సిటీ రైళ్ల తయారీకి రంగం సిద్ధం**

**ప్రధాని మోడీ, మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు కిషన్ రెడ్డి కృతజ్ఞతలు**

2

# తెలంగాణలో అంచనాను మించి ధాన్యం ఉత్పత్తి

## అక్రమ వలసదారులకు మమత చేయూత

### తృణమూల్ నేతలో ఊతకర్ర అందించిన వైనం

### సరిహద్దు వెంట అక్రమ వలసదారులు పరుగు

**కోల్‌కతా, అక్షరకలం ప్రతినిధి**

మమతా బెనర్జీ కాలం నాటి అక్రమాలు తన్నుకు వస్తున్నాయి. ముఖ్యంగా బంగాదేశ్ చొరబాటు దారులను ఎలా కాపాడారో కూడా అర్థం అవుతోంది. అలాగే చొరబాటు దారులకు గేట్లు బార్లా తెరిచారు. ఈ విషయం ఇప్పుడు కళ్లకు కనపడుతోంది. పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బంగ్లాదేశీ అక్రమ వలసదారుల కంటిమీద కునుకు లేకుండా పోయింది. అరెస్టుల భయంతో అక్రమ వలసదారులు అల్లాడిపోతున్నారు. ఈ నేపథ్యంలోనే నిత్యం వందల మంది సరిహద్దు ప్రాంతాలు, ఇండియా నుంచి బంగ్లాదేశ్‌కు వెళ్లే మార్గాలకు చేరుకుంటున్నారు. ఇండియా టుడే కథనం మేరకు.. బంగ్లాదేశ్ తిరిగి వెళ్లిపోవటానికి ప్రయత్నిస్తున్న అక్రమ వలసదారులు మీడియాతో మాట్లాడుతూ దేశంలోకి ఎలా వచ్చారో చెప్పారు. కొంతమంది తాము నదులు దాటి భారత దేశంలోకి ప్రవేశించామని చెప్పారు. మరి కొంతమంది తాము మధ్యవర్తుల ద్వారా ఇండియాలోకి వచ్చామన్నారు. చీకటిలో సరిహద్దులు దాటి దేశంలోకి ప్రవేశించామని తెలిపారు. మధ్యవర్తుల సాయం ఉంటే 10 నిమిషాల్లో దేశంలోకి ప్రవేశించవచ్చని ఓ అక్రమ వలసదారుడు మీడియాకు తెలిపాడు. తృణమూల్ కాంగ్రెస్ పార్టీలో పని చేసే కొంతమంది కార్యకర్తల సాయంతో తాము భారత దేశంలోకి వచ్చామని, వారే తమకు అన్ని డాక్యుమెంట్లు తయారు చేసి ఇచ్చారని వెల్లడించారు. డాక్యుమెంట్ల కారణంగా తాము భారత్‌లో పలు పథకాల ద్వారా డబ్బులు పొందామని, ఓట్లు కూడా వేశామని చెప్పారు. బంగ్లాదేశ్‌లోని కుస్తియా జిల్లాకు చెందిన ఓ కార్పెంటర్ మాట్లాడుతూ.. 'నేను ఇండియాలోకి రావడానికి మధ్యవర్తికి 7 నుంచి 8 వేల రూపాయలు ఇచ్చాను. ఆ మధ్యవర్తి బీఎస్‌ఎఫ్ కదలికలను ఎప్పటికప్పుడు గమనిస్తుంటాడు. రాత్రి పూట బీఎస్‌ఎఫ్ సిబ్బంది లేని సమయంలో పెద్ద సంఖ్యలో జనాలను ఇండియాలోకి పంపుతాడు' అని చెప్పాడు. తాను ఏజెంట్‌కు 20 వేల రూపాయలు ఇచ్చి భారత్‌లోకి వచ్చానని బెంగళూరులో ఉంటున్న ఓ అక్రమ వలసదారుడు మీడియాతో చెప్పాడు. ఇలా పుంఖాను పుంఖానులుగా కథనాలు వెలువడుతున్నాయి.

## సెక్స్ వర్కర్లపై దాడులు సరికాదు

### వారు కూడా మనుషులే అని గుర్తించాలి

### లైంగిక వృత్తిలో ఉన్నవారికి ఆధార్ కార్డులు ఇవ్వాలి

### సుప్రీం కోర్టు స్పష్టీకరణ

**న్యూఢిల్లీ, అక్షరకలం ప్రతినిధి**

స్వచ్ఛందంగా ప్రాస్టిట్యూషన్‌ను ఎంచుకోవడం, మానవ అక్రమ రవాణా బారినపడి సెక్స్ వర్క్‌లోకి దిగడం మధ్య స్పష్టమైన తేడా ఉందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఇష్టపూర్వకంగా సెక్స్ వర్క్ చేసే వయోజనులను వేధించవద్దని పోలీసులకు ఆదేశాలు జారీ చేసింది. సెక్స్ వర్కర్లకు చట్టపరంగా సమాన రక్షణ ఉండాలని పేర్కొంది. దాడుల సమయంలో వారి గుర్తింపును వెల్లడించొద్దని మీడియాకు కూడా వార్నింగ్ ఇచ్చింది. దేశంలో మానవ అక్రమ రవాణాను అరికట్టేందుకు సమగ్ర మార్గదర్శకాలు జారీ చేసింది. స్వచ్ఛందంగా సెక్స్ వర్క్‌ను ఎంచుకున్న వారికి, మానవ అక్రమ రవాణా ముఠాల బారిన పడి ఈ రొంపిలో కూరుకుపోయిన బాధితులకు మధ్య తేడాను గుర్తించాలని సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. సొంత ఇష్టంతో సెక్స్ వర్క్ నిర్వహించే వయోజనులపై దాడులు చేయడం, క్రిమినల్ కేసులు పెట్టడం చట్టవిరుద్ధమని పేర్కొంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం ప్రతి ఒక్కరికీ గౌరవంగా జీవించే హక్కు ఉందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. కేవలం లైంగిక వృత్తిలో తల్లి ఉందనే ఏకైక కారణంతో ఆమె నుంచి బిడ్డను బలవంతంగా వేరు చేయలేరని కూడా సుప్రీం కోర్టు పేర్కొంది. రెస్క్యూ ఆపరేషన్ల సమయంలో సెక్స్ వర్కర్ల ఫోటోలు, వీడియోలు ప్రసారం చేయడం నేరమని పేర్కొంది. నివాస ధ్రువీకరణ పత్రాలు లేకపోయినప్పటికీ సెక్స్ వర్కర్లందరికీ తక్షణమే ఆధార్ కార్డులు జారీ చేయాలని కూడా ఆదేశించింది. స్వచ్ఛందంగా ఈ మార్గాన్ని ఎంచుకున్న వారిని వదిలి, మహిళలు, మైనర్లను అక్రమ రవాణా చేసే మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవాలని కూడా సుప్రీం కోర్టు ఆదేశించింది.

## నీట్ పేపర్ లీక్ బాధ్యత ఎవరిది


### యూపిపిఎస్‌సిని చూసి నేర్చుకోండి

### విద్యార్తులు, వారి తల్లిదండ్రల ఆందోళనకు బాధ్యులెవరు

### నీట్ పేపర్ లీక్‌పై మరోమారు సుప్రీం ఆగ్రహం

**న్యూఢిల్లీ, అక్షరకలం ప్రతినిధి**

నీట్ యూజీ పరీక్ష పేపర్ లీక్ వివాదంపై సుప్రీం కోర్టు మరోసారి తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. పర్యవేక్షణా యంత్రాంగాలు, సంబంధిత కమిటీలు ఉన్నప్పటికీ ఇంత పెద్ద ఉల్లంఘన ఎలా జరిగిందని కేంద్రాన్ని ప్రశ్నించింది. ఇలాంటి సంఘటన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు తీవ్ర మానసిక క్షోభను కలిగిస్తుందని, వారిని ఇలా నిరాశపెట్టడం సరికాదని అభిప్రాయపడింది. పేపర్ లీక్ విషయంలో లోపాలకు జవాబుదారీతనం ఉండాల్సిందేనని, అప్పటి వరకు అసలు సమస్య ఆగదని వ్యాఖ్యానించింది. అయితే, యువత ఆందోళనలను ప్రభుత్వం తీవ్రంగా పరిగణనలోకి తీసుకుంటోందని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సుప్రీం ధర్మాసనానికి వెల్లడించారు. పరిస్థితిని ప్రధానమంత్రి కూడా వ్యక్తిగతంగా పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. జూన్ 21న మరోసారి నిర్వహించే నీట్-యూజీ పరీక్ష కోసం కొత్త యంత్రాంగాలను ఏర్పాటు చేశామన్నారు. అయితే, ఈ వ్యవహారంపై ప్రతిస్పందన తెలియజేయాలని కేంద్రాన్ని ఆదేశించిన సుప్రీం ధర్మాసనం.. తదుపరి విచారణను జులై రెండో వారానికి వాయిదా వేసింది. నీట్ పేపర్ లీక్ ఉదంతంపై విచారణ చేపట్టిన సుప్రీం కోర్టు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీపై(ఎన్‌టీఏ) పలు ప్రశ్నలు సంధించింది. ఇన్ని నిఘా వ్యవస్థలు, కమిటీలు ఉన్నా పేపర్ ఎలా లీకైందని ప్రశ్నించింది. యూపీఎస్‌సీలో ఇలాంటి ఉదంతాలు ఎప్పుడూ వెలుగుచూడలేదని సర్వోన్నత న్యాయస్థానం పేర్కొంది. యూపీఎస్‌సీని చూసి నేర్చుకోవాలని ఎన్‌టీఏకు సూచించింది. నీట్ వ్యవస్థ ప్రక్షాళనకు కేంద్రం ఏర్పాటు చేసిన హైలెవెల్ కమిటీ చైర్మన్, ఇస్రో మాజీ చీఫ్ డా. రాధాకృష్ణన్ కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎన్‌టీఏ, డా. రాధాకృష్ణన్ దాఖలు చేసిన అఫిడవిట్‌లను సర్వోన్నత న్యాయస్థానం పరిశీలించింది. కేంద్రం తన ఎఫిడవిట్ దాఖలు చేసేందుకు న్యాయస్థానం అదనపు గడువు ఇచ్చింది. ఈ సందర్భంగా న్యాయమూర్తి జస్టిస్ నరసింహ మాట్లాడుతూ పేపర్ లీక్‌కు ఆస్కారం కల్పించిన పరిస్థితులు ఏమిటని డా. రాధాకృష్ణన్‌ను కోర్టు ప్రశ్నించారు. గతంలో అనేక రక్షణలను ఏర్పాటు చేసినా పేపర్ లీక్ ఎలా అయ్యిందని అన్నారు. ఇందుకు డా. రాధాకృష్ణన్ బదులిస్తూ పేపర్ సెట్టింగ్ పక్రియలో సమస్య ఉందని అన్నారు. ప్రస్తుతం ఆ లోపాలను సరిదిద్ది వ్యవస్థను మరింత బలోపేతం చేశామని అన్నారు. పరీక్ష నిర్వహణలో ఎలాంటి సమస్య తలెత్తకుండా గతంలో మొత్తం 101 సూచనలు చేశామని చెప్పారు. వాటిల్లో 60 తాత్కాలిక సూచనలను 2025-26 పరీక్ష కోసం ప్రత్యేకంగా రూపొందించినట్టు చెప్పారు. ఇతర మార్గదర్శకాలు కూడా త్వరలో పూర్తిస్థాయిలో అమలవుతాయని చెప్పారు. మరోసారి ఇలాంటివి జరగవని ధీమా వ్యక్తం చేశారు. సంస్కరణలే తమ లక్ష్యమని పేర్కొన్నారు. కేవలం సంస్కరణలతో పరిస్థితి చక్కబడదని కోర్టు వ్యాఖ్యానించింది. తప్పు జరిగినప్పుడు బాధ్యత ఎవరిదనే దానిపై స్పష్టత ఉండాలని పేర్కొంది. బాధ్యత ఎవరు తీసుకుంటారనేది తేల్చకుండా ఎన్ని కమిటీలు, మీటింగ్‌లు ఏర్పాటు చేసిన ఫలితం ఉండదని వ్యాఖ్యానించింది. ఇక ఈ అంశంపై సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా స్పందిస్తూ పేపర్ లీక్‌పై విచారణ జరుగుతోందని అన్నారు. జూన్ 21 నాటి పరీక్ష నిర్వహణ కోసం కొత్త వ్యవస్థలను ఏర్పాటు చేశామని అన్నారు. ప్రభుత్వం ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకుందని చెప్పారు. ప్రధాని స్వయంగా ఈ అంశాన్ని పర్యవేక్షిస్తున్నారని కోర్టుకు తెలిపారు.




### అయిన ఆచివరి గింజ వరకు కొంటూనే ఉన్నాం

### తడిసిన ధాన్యం సైతం కొని రైతులను ఆదుకున్నాం

### అదనపు కొనుగోళ్లకు రూ.16,479 కోట్లు ఖర్చు చేశాం

### మీడియా సమావేశంలో మంత్రులు వెల్లడి

**హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి**

: దేశంలోనే అత్యధికంగా ధాన్యం కొనుగోలు చేస్తున్న రాష్ట్రం తెలంగాణ అని ఈ మాట కేంద్రమే చెప్పిందని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. గతంలో పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కొనుగోళ్ల కంటే ఇప్పుడు ఎక్కువ కొంటున్నాం అన్నారు. సహచర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్‌తో కలిసి ఉత్తమ్ కుమార్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ విధానాలు పాటిస్తూ చెప్పిన దానికంటే అదనంగా కొనుగోలు చేశాం అన్నారు. . దీనికోసం రూ.16,479 కోట్లు ఖర్చు చేశాం. రాష్ట్రంలో చివరి గింజ వరకు కొనుగోలు చేసే బాధ్యత మాది అని ఉత్తమ్ తెలిపారు. ధాన్యం సేకరణకు క్షేత్రస్థాయిలో 13వేల వాహనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. 2 లక్షల మంది సిబ్బంది సేకరణలో పాల్గొంటున్నారని చెప్పారు. సేకరణ కేంద్రాలకు 20.86 కోట్ల గన్నీ బ్యాగులు పంపామన్నారు. ధాన్యం కొనుగోలు చేసి రూ.11,050 కోట్లు రైతుల ఖాతాల్లో జమచేశామని వివరించారు. 'ధాన్యం సేకరణకు బిహార్, బెంగాల్ కార్మికులపై ఆధారపడి ఉన్నాం. బెంగాల్ ఎన్నికలకు కార్మికులు స్వస్థలాలకు వెళ్లి రావడం ఆలస్యమైంది. మద్దతు ధర కోసం మా ప్రభుత్వం రూ.49 వేల కోట్లు వెచ్చించగా.. గత ప్రభుత్వం రూ.10వేల కోట్లే ఇచ్చింది. ఈ విషయంలో ప్రతిపక్షాలు అసత్య ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. ఇప్పటికే రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్లు ఊపందుకున్నాయన్నారు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి. గతంలో ఎన్నడూ లేని విధంగా ధాన్యం పండింది.. ఏ రాష్ట్రంలో జరగని విధంగా తెలంగాణ రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు జరుగతున్నాయని స్పష్టం చేశారు.



ధాన్యం సేకరణలో తెలంగాణ దేశంలోనే నంబర్ వన్ గా ఉందన్నారు. ధాన్యం సేకరణ విషయంలో ప్రతిపక్ష బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. రాష్ట్రంలో కనీస మద్దతు ధరకే అన్ని రకాల ధాన్యం కొనుగోలు చేస్తున్నామన్నారు. ఎంఎస్ పీ ధరకు ధాన్యం కొనుగోలు చేసేందుకు 16వేల కోట్ల రూపాయలు ఖర్చు ప్రభుత్వం ఖర్చు చేసిందన్నారు. రాష్ట్రంలో 143 లక్షల టన్నుల ధాన్యం పండితే.. ఇప్పటివరకు 73 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లోనే రైతు ఖాతాల్లోకి డబ్బులు జమ చేస్తున్నామన్నారు. చివరి గింజ వరకు మద్దతు ధరకే ధాన్యం కొనుగోలు చేస్తామన్నారు. యాసంగిలో రాష్ట్ర ప్రభుత్వం 73 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేసింది..అయితే ఇందులో కేంద్ర ప్రభుత్వం కేవలం 5 లక్షల ధాన్యమే కొనుగోలు చేస్తామని చెబుతోంది.. ఏటా తెలంగాణ నుంచి ధాన్యం కొనుగోళ్లను తగ్గిస్తూ వస్తోంది. ధాన్యం కొనుగోళ్లు పెంచాలని కేంద్రాన్ని సీఎం రేవంత్ రెడ్డితో కలిసి కేంద్ర ప్రభుత్వాన్ని కోరినా పట్టించుకోవడం లేదు. బీజేపోళ్లు ధర్నా చేసుడు కాదు.. ఢిల్లీకి వెళ్లి వడ్లను కొనాలను కేంద్రంపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. ధాన్యం కొనుగోళ్లకు 16వేల కోట్ల రూపాయలు అదనంగా ఖర్చు చేశామన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ఉన్న చివరి గింజ వరకు ధాన్యం సేకరణ జరుగుతుందన్నారు. ధాన్యం సేకరణలో 2వేల మిల్లులు పనిచేస్తున్నాయన్నారు. ధాన్యం తరలించేందుకు 13వేల వాహనాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. రాష్ట్రంలో హమాలీల కొరత ఉన్న మాట వాస్తవమే అయినప్పటికీ ధాన్యం కొనుగోలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. బీఆర్ ఎస్ హయాంలో ఏడాదికి 15వేల ఇస్తే కాంగ్రెస్ హయాంలో 49వేల కోట్లు ఇస్తున్నామన్నా రు మంత్రి.. తెలంగాణలో 60 లక్షల టన్నుల ధాన్యం కొంటే.. ఏపీలో 24 లక్షలే కొన్నరని పోల్చి చెప్పారు. ఇప్పటివరకు రూ.11వేల 50కోట్లు రైతుల ఖాతాల్లో వేశాం.. రెండున్నరేళ్లలో రూ.36వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశామన్నారు. వడ్లను కొన్న 48 గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నామన్నారు. చివరి గింజ కొనేవరకు కొనుగోలు కేంద్రాలు పనిచేస్తాయని, ఇటీవల కురిసిన వర్షాలకు తడిసిన 10వేల 214 టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రైతులను ఆదుకున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు.

## కాజీపేట రైల్వే మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్

### 200 ఇంటర్ సిటీ రైళ్ల తయారీకి రంగం సిద్ధం

### ప్రధాని మోడీ, మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు కిషన్ రెడ్డి కృతజ్ఞతలు

**హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి**

కాజీపేట రైల్వే మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్‌కు 200 ఇంటర్‌సిటీ రైళ్ల తయారీ బాధ్యతను ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం అప్పగించడంపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్రం నిరంతర సహకారం అందిస్తోందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ, రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ మేరకు సోషల్ మీడియా 'ఎక్స్' వేదికగా స్పందించారు. రాబోయే ఐదేళ్లలో 200 ఇంటర్‌సిటీ రైళ్లను తయారు చేయాలని రైల్వే శాఖ నిర్ణయించిందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. దీనిపై సమీక్ష నిర్వహించి, ఆ బాధ్యతను కాజీపేట రైల్వే మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్‌కు అప్పగిస్తూ రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ నిర్ణయం తీసుకోవడం హర్షనీయమన్నారు. ఈ ఇంటర్‌సిటీ రైళ్లు 20 కోచ్‌ల కాన్ఫిగరేషన్‌తో, ఆటోమేటిక్ డోర్ క్లోజింగ్, మెరుగైన వెంటిలేషన్, సురక్షితమైన కోచ్ డిజైన్ వంటి ఆధునిక సదుపాయాలను కలిగి ఉంటాయని ఆయన పేర్కొన్నారు. వీటిని సాధారణంగా సుమారు 300 కిలోమీటర్ల దూరం ఉన్న మార్గాల్లో నడిపిస్తారని తెలిపారు. అలాగే ప్రతి ట్రిప్‌లో చాలా స్టాప్‌లు ఉంటాయని కేంద్ర మంత్రి చెప్పారు. ఇంటర్‌సిటీ రైళ్లు గంటకు 130 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తాయని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు. పట్టణాలు, నగరాల మధ్య ప్రజలు సులభంగా ప్రయాణించేందుకు ఈ రైళ్లు ఉపయోగపడతాయని అన్నారు. ఇవి తమ సమీప పట్టణాల్లో ఉన్నత విద్య కోసం వెళ్లే విద్యార్థులకు సౌకర్యవంతంగా ఉంటాయని చెప్పారు. అలాగే ఆరోగ్యం, ఉద్యోగం, ఉపాధి కోసం ప్రయాణించే సామాన్య ప్రజలకూ ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు.

## ఉచిత కరెంట్ ఎగవేసే పన్నాగం

### కాంగ్రెస్ తీరుపై హరీష్ రావు ఆగ్రహం

**హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి**

రైతులకు 24 గంటల కరెంట్ అవసరం లేదు. 3 గంటల కరెంట్ చాలని ఈఆర్‌సీ ఎదుట కాంగ్రెస్ నేత, రైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే , అసెంబ్లీ ఫ్లోర్ లీడర్ హరీష్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నాయకుడు వ్యాఖ్యలు రేవంత్ ప్రభుత్వ రైతు వ్యతిరేక ముఖాన్ని బట్టబయలు చేశాయని పేర్కొన్నారు. అమెరికా వేదికగా రేవంత్ రెడ్డి చెప్పిన మాటలను ఇప్పుడు అమలు చేసే దిశగా కుట్రలు జరుగుతున్నాయని వెల్లడించారు. పొలం అంటే ఏమిటో.. బోరు ఆగిపోతే పంట ఎలా ఎండిపోతుందో.. రైతు రాత్రింబవళ్లు ఎలా కష్టపడుతాడో తెలియని వాళ్లు మాత్రమే 3 గంటల కరెంట్ చాలని మాట్లాడతారని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుకు 24 గంటల నాణ్యమైన ఉచిత కరెంట్ ఇచ్చి తెలంగాణ వ్యవసాయాన్ని దేశానికి ఆదర్శంగా నిలబెట్టిందని, కాంగ్రెస్ మాత్రం అదే రైతును మళ్లీ చీకట్లలోకి నెట్టే ప్రయత్నం చేస్తోందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత రుణమాఫీని అటకెక్కించారని, రైతు బంధు బంద్ చేశారని, పంట బోనస్ బోగస్ చేశారని మండి పడ్డారు. ఎరువుల సరఫరాలో ఫెయిల్ అయ్యారు. పంట కొనుగోళ్లు చేయక రైతుల ప్రాణం తీస్తున్నారని విమర్శించారు. ఇవి చాలదన్నట్లు కేసీఆర్ ఎంతో శ్రమించి అమలు చేసిన 24 గంటల కరెంట్‌ను ప్రణాళిక ప్రకారం ఖతం



పట్టిస్తున్నారని ఆరోపించారు. రైతు డిస్కం వెనుక దాగి ఉన్న కాంగ్రెస్ అసలు కుట్ర ఇదేనా? అంటూ అనుమానాలు వ్యక్తం చేశారు. కరెంట్ కోతలతో, రైతులకు వాతలు పెట్టాలని చూస్తున్న రేవంత్ కుట్రలను యావత్ తెలంగాణ రైతాంగం గమనిస్తోందని, రైతు వ్యతిరేక కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పే రోజు దగ్గరలోనే ఉందని జోస్యం చెప్పారు.

## ప్రొఫెసర్ నాగేశ్వర్ రావుకు వ్యతిరేకంగా నిరసన



**మందమర్రి, మే 29 అక్షర కలం:**

ప్రొఫెసర్ నాగేశ్వర్ రావు నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశాన్ని జనసేన పార్టీ నాయకులు ఖండిస్తూ నిరసన వ్యక్తం చేశారు. శుక్రవారం పట్టణ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో జనసేన పార్టీ ఆడ్ హాక్ కమిటీ సభ్యుడు మాయ రమేష్, జనసేన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా విద్యార్థి విభాగ అధ్యక్షుడు ఆవుల సాగర్ మాట్లాడుతూ, ప్రజలను తప్పుదారి పట్టించే విధంగా నిర్వహిస్తున్న సమావేశాలను ఖండిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కోఆర్డినేటర్ మంతెన సంపత్, పార్టీ నాయకులు పిట్టల సుధాకర్, వొడ్నల హరీష్, ఎర్రోజుల సదానందం, మేకల పవన్ కళ్యాణ్, ఐటీ కోఆర్డినేటర్ ముక్తా అవినాష్‌తో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


## ఓటరు జాబితాను పకడ్బందీగా రూపొందించాలి

### ఈసీఐ మార్గదర్శకాల మేరకు ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తి చేయాలి :

### రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి

**సంగారెడ్డి ప్రతినిధి, అక్షరకలం..**

ఓటరు జాబితాను ఎలాంటి తప్పిదాలకు అవకాశం లేకుండా పారదర్శకంగా, పకడ్బందీగా రూపొందించేందుకు ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్ ) ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి, అదనపు ప్రధాన ఎన్నికల అధికారి వాసం వెంకటేశ్వర్ రెడ్డి, ఇతర ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఈఆర్వోలు, ఏఈఆర్వోలు, బీఎల్ఓ సూపర్వైజర్లకు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్ ప్రక్రియ నిర్వహణ, ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, ఓటర్ల ధృవీకరణ, ఇంటింటి పరిశీలన తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శిక్షణ, అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఈఓ సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, భారత ఎన్నికల సంఘం నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా, సమయపాలనతో నిర్వహించాలని సూచించారు. ఎన్యూమరేషన్ ఫారాలను ఓటర్లకు అందజేసిన అనంతరం సంబంధిత బీఎల్ఓలు ప్రతి ఇంటిని కనీసం మూడుసార్లు సందర్శించి, ఓటర్ల నుంచి డిక్లరేషన్ స్వీకరించాలని



తెలిపారు. ఎన్యూమరేషన్ ఫారాలు నింపడం, ఓటర్ల వివరాల పరిశీలన, అవసరమైన పత్రాల ధృవీకరణ తదితర అంశాలపై బీఎల్ఓలకు ఈఆర్వోలు సమగ్ర శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. అలాగే రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి, బూత్ లెవల్ ఏజెంట్ల నియామక ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో సంగారెడ్డి జిల్లా నుంచి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్లు సంగీత, పాండు, సబ్ కలెక్టర్ ఉమాహారతి, ఈఆర్వోలు, ఏఈఆర్వోలు, బీఎల్ఓ సూపర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

అక్షరకలం
తెలుగు దినపత్రిక
సంపాదకీయం...

# వినియోగదారుల ఆదరాభిమానాలు చొరగొంటున్న అంజనీపుత్ర

## తమిళ రాజకీయాల్లో విజయ్ ఎత్తులు !

తమిళనాడు రాజకీయాలు రసవత్తర మలుపులు తిరుగుతున్నాయి. మద్దతుల ఇచ్చిన అన్నా డిఎంకె ఎమ్మెల్యేలు మళ్లీ పళనిస్వామి చెంతకు చేరారు. మేమంతా మీ వెంటే అని ప్రకటించారు. ఈ ప్రభుత్వం ఎక్కువ కాలం మనలేదని డిఎంకె నేత స్టాలిన్ ఇప్పటికే శాపనార్థాలు పెట్టారు. ఈ స్థితిలో కాంగ్రెస, లెఫ్, ముస్లిం పార్టీల మద్దతు బొటాబొటిగా ఉంది. దీంతో మరో ఐదేళ్లపాటు లాక్కురావడం అంత సులభం కాదు. ఎందుకంటే ఐదారు సీట్ల మద్దతుతో వారి గొంతెమ్మ కోర్కెలు తీర్చడం సిఎం విజయ్‌కు తలనొప్పిగా పరిణమించవచ్చు. ఈ క్రమంలో సొంతగా బలం కోసం టివికె అధినేత, సిఎం కొత్త ఎత్తులు వేస్తున్నట్లు తెలుస్తోంది. ద్రవిడ పార్టీలకు చెక్ పెట్టడంతో పాటు తమిళనాట పాతుకు పోయేందుకు రాజకీయంగా ఎత్తులు వేస్తున్నట్లు పరిస్థితులు తెలియచేస్తున్నాయి. చిల్లర పార్టీలతో కలిసి నడిచేకంటే సొంతగా బలం సమకూర్చుకోవడం ఉత్తమమని ఆయన భావనలో ఉన్నారు. అందుకే ఇటీవల అన్నాడిఎంకెకు చెందిన నలుగురు ఎమ్మెల్యేలు రాజీనామా చేసి విజయ్ పంచన చేరారు. వారు ఉప ఎన్నికల్లో టివికె పార్టీ పక్షాన గెలిస్తే సొంతబలం పెరగవచ్చు. ఇలా సొంత బలం కోసం అవసరమైన ఇతర పార్టీల్లోని ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి గెలిపించుకోవాలన్న ఎత్తుగడలో సిఎం విజయ ఉన్నట్లు సమాచారం. ఓవైపు ప్రజాసంక్షేమ కార్యక్రమాలు చేస్తూ ప్రజల్లో అభిమానం పెంచుకోవడంతో పాటు, పార్టీ బలాన్ని పెంచుకునేలా టివికె చీఫ్ ఎత్తుడగులు సాగుతున్నాయి. అధికారంలో ఉంది మన ప్రభుత్వమే అని డీఎంకే అధినేత ఎం.కె.స్టాలిన్ పార్టీ కార్యకర్తలతో అన్నట్లు విస్తృత ప్రచారంలో ఉంది. మరో సందర్భంలో విజయ్ ప్రభుత్వం కూలిపోయేందుకు సిద్ధంగా ఉందని ఆయనే వెల్లడించారు. ఈ మాటల్ని అనుసరించి.. టీవీకే ప్రభుత్వాన్ని తాను నియంత్రించేస్థాయిలో ఉన్నారని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇది టీవీకేకు మింగుడు పడటంలేదు. మరోవైపు అన్నాడీఎంకే చీలికల కారణంగా మద్దతుగా నిలిచిన 25 మందిలో కొందరు మంత్రి పదవుల్ని ఆశించినట్లు ప్రచారంలో ఉంది. మంత్రివర్గ విస్తరణలో వారికెలాంటి స్థానం లేకపోవడం, కాంగ్రెస్ లో ఇద్దరికి దక్కడంతో పాటు డీఎంకే కూటమిలోని ఐయూఎంఎల్, వీసీకేకు చెరొక మంత్రిపదవి ఇవ్వడంతో అన్నాడీఎంకే చీలిక శ్రేణులు అసంతృప్తిగా ఉన్నట్లు తేలింది. డీఎంకే అధిపత్యం తగ్గించే వ్యూహంలో.. అన్నాడీఎంకే చీలిక ఎమ్మెల్యేలు తమవైపు ఉండటాన్ని లాభంగా మలచుకోవాలని టీవీకే చూస్తోంది. తమ పార్టీలోకి రావాలంటే రాజీనామాలు చేయాలనే షరతు విధించినట్లు విశ్వసనీయంగా చెబుతున్నారు. ఇందులో భాగంగానే నలుగురు రాజీనామా చేసి టీవీకేలో చేరారు. రాజీనామాలు చేసేందుకు మరికొందరు అన్నాడీఎంకే చీలికవర్గం ఎమ్మెల్యేలు సిద్ధమవుతున్నట్లు సమాచారం. టీవీకేకు అసెంబ్లీ ఎన్నికల్లో మ్యాజిక్ ఫిగర్ రాకపోవడంతో.. ఆ పార్టీకి మద్దతిచ్చే పక్రియలో రెండు ప్రధాన కూటములు ఎవరి ఆట వారు ఆడుతున్నట్లు కనిపిస్తోంది. ఇప్పుడు విజయ్ కొత్త ఆట మొదలుపెట్టారు. పలువురు ఎమ్మెల్యేలతో రాజీనామాలు చేయించి విజిల్ గుర్తుపై బరిలోకి పంపి.. వారిని గెలిపించి.. ఇతర పార్టీల మద్దతు లేని సొంత ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసే దిశగా అడుగులు వేస్తున్నారు. ఇటీవల అసెంబ్లీలో జరిగిన బల ప్రదర్శనలో టీవీకే ప్రభుత్వం అనూహ్య మద్దతు కూడగట్టుకుంది. ఏకంగా 144 ఎమ్మెల్యేల బలాన్ని అందుకుంది. ఈ సంఖ్యలోనే అనేక వ్యూహాలు కనిపిస్తున్నట్లు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. టీవీకేపై ఆధిపత్యం కోసం ఇటు డీఎంకే కూటమి, అటు అన్నాడీఎంకే ఓ వర్గం అంతర్గత వ్యూహాల్ని రచించినట్లు తెలుస్తోందంటున్నారు. అంతర్గత నిర్ణయాల కారణంగా తమ కూటమిలోని వీసీకే, ఐయూఎంఎల్, సీపీఐ, సీపీఎం పార్టీలకు చెందిన 8 సీట్లను టీవీకే మద్దతుగా ఇచ్చారు. మరోవైపు టీవీకేతో జట్టుకట్టిన కాంగ్రెస్‌కు 5 సీట్లు, ఏఎంఎంకే నుంచి బయటికి వచ్చి స్వతంత్ర అభ్యర్థిగా మద్దతిచ్చిన కామరాజ్ ఓటు కలిపి.. టీవీకేకు 119 సీట్ల వచ్చింది. కోర్టు ఆంక్షలతో తిరపత్తూర్ ఎమ్మెల్యే ఓటింగ్‌కు పాల్గొనలేదు, తిరుచ్చి తూర్పుస్థానం ఖాళీగా ఉండటం, స్పీకర్ ఓటు లెక్కలోకి లేకపోవడంతో టీవీకే బలం 105గా ఉంది. ఇతరుల మద్దతుతో ఓటింగ్‌కు ముందే మ్యాజిక్ ఫిగర్ దాటినట్లు అంచనాలు వచ్చాయి. ఇక అసెంబ్లీలో ఓటింగ్ జరుగుతున్న




క్రమంలో అన్నాడీఎంకే చీలికవర్గం నుంచి అనూహ్యంగా మరో 25 ఓట్లు దక్కాయి. దీంతో బలం 144కు చేరింది. రెండు కూటముల నుంచి టీవీకేకు బలం అందడంతో వచ్చే 6నెలలదాకా ప్రభుత్వం కూలడానికి ఉన్న అడ్డంకులన్నీ తొలగిన్లట్లైంది. మద్దతు పార్టీల సంగతి అటుంచితే.. ఇప్పటికిప్పుడు టీవీకే నెమ్మదిగా బలపడుతోంది. సొంతంగా 107 స్థానాలు దగ్గరున్నాయి. 5 కాంగ్రెస్, ఒక స్వతంత్రతో పాటు ప్రస్తుతం ఖాళీగా ఉన్న 5 అసెంబ్లీ స్థానాల్లో గెలిస్తే.. 118 స్థానాల బలమొస్తుంది. అన్నాడీఎంకే చీలిక వర్గంలోని మరికొందరు రాజీనామాలకు సిద్ధపడి టీవీకే గుర్తుపై పోటీ చేసే అవకాశమొస్తే మ్యాజిక్ ఫిగర్ 118ని దాటి స్థిరమైన ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసే అవకాశముందని రాజకీయ విశ్లేషకుల్లో చర్చ సాగుతోంది. తిరుచ్చి ఈస్ట్‌లో విజయ్‌కు 91,381 ఓట్లు వచ్చాయి. ఈయన డీఎంకేపై 27,416 ఓట్లతో గెలిచారు. ఇక్కడ అన్నాడీఎంకే చీలికవర్గ బలం తోడైతే అవలీలగా లక్ష ఓట్లు దాటొచ్చనేది అంచనా. రాజీనామాలు చేసిన స్థానాల్లో.. చెంగల్పట్టు జిల్లా మదురాంతకం(ఎస్సీ), తిరునెల్వేలి జిల్లా అంబాసముద్రం కలుపుకుని ఇప్పుడు తొలి 3 స్థానాల పార్టీలు టీవీకేవైపు ఉండటంతో ఇక్కడ లక్షన్నర ఓట్లకు తగ్గని బలముంది. 4 రాజీనామా స్థానాల్లో తిరిగి టీవీకే అభ్యర్థి గెలిచే అవకాశాలు సమృద్ధిగా ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. ఇలా మరిన్ని స్థానాలు విజయ్‌కి తోడై అవలీలగా, ఒంటరిగా టీవీకే ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, తద్వారా డీఎంకే ప్రభావాన్ని లేకుండా చేయడంతో పాటు స్వేచ్ఛగా పాలన అందించే దిశగా అడుగులు వేసే అవకాశాన్ని టీవీకే పరిశీలిస్తోంది. ఈ సమీకరణాలతో విజయ్ రాష్ట్రంలో మరింత బలపడాలని చూస్తున్నారు. అదే జరిగితే ద్రవిడ పార్టీలకు మనుగడ కష్టమే.

### ఉత్తర తెలంగాణలో పేరుగాంచిన అంజనీపుత్ర ఎస్టేట్స్ సామాజిక బాధ్యతగా సేవ కార్యక్రమాల నిర్వహణ

**అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, మే 29:**

జిల్లాలో రియల్ ఎస్టేట్ రంగంలో వినియోగదారుల నమ్మకం, అభిమానంతో అంజనీపుత్ర ఎస్టేట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రియల్ ఎస్టేట్ రంగంలో దిగ్గజ సంస్థగా ఎదిగారు. జిల్లాలో అనేక వెంచర్లు ప్రారంభించి, రియల్ ఎస్టేట్ రంగంలో తన ప్రయాణాన్ని అప్రతిహతంగా కొనసాగిస్తున్నారు. మధ్య తరగతి, ధనిక వర్గాల సొంత ఇంటి కలను నెరవేరుస్తూ, జిల్లాలో అంజనీపుత్ర ఎస్టేట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ తనకంటూ ప్రస్థానాన్ని గణనీయంగా కొనసాగిస్తుంది. ఈ క్రమంలో జిల్లాలోని మందమర్రి మండలం వెంకటాపూర్, లేమూరు గ్రామంలో అంజనీపుత్ర యాజమాన్యం అనుబంధ సంస్థ ఎవర ఎస్కేప్స్ పేరుతో నూతనంగా వెంచర్ ను ప్రారంభించారు. గత కొన్ని సంవత్సరాలుగా జిల్లాలో అనేక వెంచర్లను ప్రారంభించి, విజయవంతంగా విక్రయాలు నిర్వహించిన అంజనీ పుత్ర యాజమాన్యం వెంకటాపూర్, లేమూరు గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన వెంచర్ లో సైతం వినియోగదారుల ఆదరాభిమానాలు చొరగొంటుందని అనడం లో ఎలాంటి




అతిశయోక్తి లేదని పలువురు అభిప్రాయపడుతున్నారు. వివిధ ప్రాంతాలలో వ్యాపారం కొనసాగిస్తూ, ప్రజల నమ్మకాన్ని, అభిమానాన్ని పొందిన అంజనీ పుత్ర సంస్థ తన సుదీర్ఘ ప్రయాణంలో ఈ నూతన వెంచర్ తో మరో కొత్త మైలు రాయిని సొంతం చేసుకుంటుంది అనడంలో ఎలాంటి సందేహం లేదు. గత కొన్ని సంవత్సరాలుగా నమ్మకమైన సంస్థగా జిల్లా తోపాటు ఉత్తర తెలంగాణ వ్యాప్తంగా అంజనీపుత్ర సంస్థకు బలమైన వినియోగదారుల మద్దతు కలదు. ప్రజల విశ్వాసం, వినియోగదారుల నమ్మకం, డైరెక్టర్ల కృషి ఫలితంగా రియల్ ఎస్టేట్ రంగంలో ఉత్తర తెలంగాణలో అంజనీపుత్ర ఎస్టేట్స్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రథమ స్థానంలో కొనసాగుతుందని మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. అంజనీ పుత్ర ఎస్టేట్స్ ప్రైవేట్ లిమిటెడ్ చైర్మన్ గుర్రాల శ్రీధర్, మేనేజింగ్ డైరెక్టర్ పిల్లి రవి, ఇతర డైరెక్టర్లు, సిబ్బంది సమిష్టి కృషితో ప్రజల ఆదరాభిమానాలు, వినియోగదారుల నమ్మకంతో పాటు ఎన్నో పురస్కారాలు, సత్కారాలు అందుకోవడం విశేషం.

**సామాజిక బాధ్యతగా సేవా కార్యక్రమాల నిర్వహణ**

అంజనీ పుత్ర సంస్థ రియల్ ఎస్టేట్ రంగం తోపాటు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ సామాజిక కర్తవ్యాన్ని నెరవేరుస్తుంది. జిల్లాలో ఏ కార్యక్రమం నిర్వహించిన అంజనీపుత్ర వైపు ప్రజలు చూస్తుంటారు. ఏ కార్యక్రమానికైనా ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా, వివిధ కార్యక్రమాలకు సహాయం అందజేసి, వారి మనుగడను తోడ్పాటు అందిస్తూ, ప్రజల నమ్మకాన్ని, నెరవేరుస్తున్నారు. ఎంతోమంది క్రీడాకారులకు, కళాకారులకు చేయూతనందించడంలో అంజనీపుత్ర యాజమాన్యం ఎల్లప్పుడూ ముందుంటు వస్తుంది. అనేక సామాజిక, ఆధ్యాత్మిక, క్రీడ కార్యక్రమాల్లో అంజనీపుత్ర యాజమాన్యం సామాజిక బాధ్యతగా సహాయం అందజేస్తున్నారు. అదే పరంపరను కొనసాగిస్తూ, అంజనీ పుత్ర రియల్ ఎస్టేట్ సంస్థ దిగ్గజ రియల్ ఎస్టేట్స్ సంస్థగా ఉత్తర తెలంగాణ తో పాటు రాష్ట్ర వ్యాప్తంగా పేరు ప్రఖ్యాతలు సంపాదించి, తనతో పాటు పలువురికి ఉపాధి కల్పించడంతోపాటు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ, రాష్ట్రంలోని రియల్ ఎస్టేట్ వ్యాపారంలో మరో దిగ్గజ సంస్థగా ఎదుగుతుందని మార్కెట్ వర్గాలు ధీమాగా తెలుపుతున్నాయి.

### మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం



**అక్షర కలం సిద్దిపేట మే 29:**

నంగునూరు గ్రామానికి చెందిన దేవులపల్లి హరిబాబు వాళ్ళ కూతురు శిరీష అనారోగ్యంతో మరణించడం జరిగింది.ఇట్టి విషయాన్నిమాజీ మంత్రివర్యులు హరీష్ రావు దృష్టికి తీసుకెళ్లగా ఆయన ఆదేశానుసారం పిఎసిఎస్ చైర్మన్ కోల రమేష్ గౌడ్ నంగునూరు గ్రామ సర్పంచ్ సానాదుల బాల పోచయ్య,వారి కుటుంబాన్ని పరామర్శించి అంత్యక్రియలకు 5000 రూపాయలను వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కోల శ్రీధర్ గౌడ్,మాజీ ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు జైపాల్ రెడ్డి, కోల మహేందర్ గౌడ్, ఎండి రహీం భాష, శ్రీనివాస్ గౌడ్,మాదిగ కులం అధ్యక్షుడు దేవులపల్లి రాజేందర్, దేవులపల్లికనకయ్య,ఐలయ్య,దేవులపల్లి కృష్ణ,నరేష్,బిక్షపతి, బాలయ్యతదితరులుపాల్గొన్నారు.

### జూన్ 5న ఇందిరాపార్క్ లో నిర్వహించబోయే మహాధర్నా ను విజయవంతం చేయండి.!

**తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ సిద్దిపేట జిల్లా శాఖ పిలుపు**


**అక్షర కలం సిద్దిపేట మే 29:**



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్యా ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా జూన్ 5న హైదరాబాద్ లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం నుండి ఇందిరాపార్క్ వరకు ర్యాలీ మరియు ధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ రాష్ట్ర స్టీరింగ్ కమిటి సభ్యులు లింగారెడ్డి ప్రకటించారు. శుక్రవారం సిద్దిపేట ప్రెస్ క్లబ్ లో విద్యా పరిరక్షణ కమిటి సిద్దిపేట జిల్లా అధ్యక్షులు సుంచు నరేందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి దేవులపల్లి కిష్టయ్య లతో ధర్నా పోస్టర్లు, కరపత్రా లను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా విద్యా పరిరక్షణ కమిటి నాయకులు గాడిపల్లి తిరుపతి రెడ్డి, విజేందర్ రెడ్డి, కిష్టయ్య, కనకయ్య, ఎస్.వి.శ్రీకాంత్ లు మాట్లాడుతూ ప్రభుత్వ విధానాల వల్ల విద్యారంగం సంక్షోభంలోకి నెట్టబడిందని,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ మేరకు విద్యకు 20 శాతం నిధులు కేటాయించాలనీ జాతీయ విద్యా విధానం 2020 ను రాష్ట్రంలో వెనక్కి తీసుకోవాలని, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల స్థాపనను నిలిపివేయాలని కోరారు. జూన్ 5న సిద్దిపేట జిల్లా నుండి అధిక సంఖ్యలోవిద్యార్థులు, ఉపాధ్యాయులు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఇట్టి కార్యక్రమంలో టిపిటిఎఫ్, డీటీఎఫ్, పీ.డీ.ఎస్.యు బాధ్యులు తిరుపతి, శ్రీనివాస్, కనకయ్య,శ్రీనివాస్, రాజిరెడ్డి, చంద్రబాను, ప్రభాకర్ రెడ్డి, ఇంద్రసేనా రెడ్డి, మల్లయ్య, సత్యనారాయణ,సత్తయ్య,నర్సింల పాల్గొన్నారు.

### మహిళా సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది.

**అక్షర కలం / ఇల్లెందు.**



ఇల్లందు మున్సిపల్ చైర్ పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్ పుట్టినరోజును పురస్కరించుకొని శుక్రవారం 16వ వార్డు కౌన్సిలర్ ఉల్లింగ విజయలక్ష్మి ఆధ్వర్యంలో చైర్ పర్సన్ పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్ ను కట్ చేసి చైర్ పర్సన్ కు తినిపించి మహిళలు ఒకరికి ఒకరు కేక్ ను తినిపించుకొని చైర్ పర్సన్ కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఇల్లందు మున్సిపల్ చైర్ పర్సన్ దొడ్డ కిరణమిత్ర డానియల్,కౌన్సిలర్ ఉల్లింగ విజయలక్ష్మి మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్ మాట్లాడుతూ మహిళా సంక్షేమానికి కృషి చేస్తున్న ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఆమె అన్నారు.

### కౌన్సిలింగ్ ద్వారా బదిలీలుచేయడం జరుగుతుంది.

**ఐటిడిఎ.పిఓ.బి.రాహుల్,**

**అక్షర కలం / భద్రాచలం**



గిరిజన సహకార సంస్థ హైదరాబాద్ వారి ముప్పై ఎనిమిదిజీవోప్రకారము భద్రాద్రి కొత్తగూడెంజిల్లాలోని,గిరిజన ప్రైమరీ కోపరేటివ్ సొసైటీ (జిసిసి) లలో పనిచేయుచున్న సేల్స్ మేన్లు, ఎం సి డబ్ల్యూ వర్కర్లు,డ్రైవర్లకు ప్రభుత్వనిబంధనలప్రకారంకౌన్సిలింగ్.ద్వారాబదిలీలుచేయడంజరిగిందనిఐటిడిఏప్రాజెక్టుఅధికారిబి.రాహుల్,అన్నారు. శుక్రవారం నాడు ఐటీడీఏ కార్యాలయంలోని తన ఛాంబర్ లో జిసిసి అధికారులు మరియు సేల్స్ మెన్ కమిటీ సభ్యుల సమక్షంలో, జిసిసి పరిధిలోని ఐదు సొసైటీలలోని డిఆర్ డిపోలలో పనిచేయుచున్న సేల్స్ మేన్లు,ఎం సి డబ్ల్యూ వర్కర్లు, డ్రైవర్లతో కలిపి ఇరవై ఎనిమిది మందిమందిసిబ్బందిపనిచేస్తున్నారనిఆయనఅన్నారు.ప్రభుత్వనిబంధనల ప్రకారం నలభై శాతం సిబ్బందికి బదిలీలుచేయవలసిఉండగాపదకొండు మందిని బదిలీ చేశామని,ఈ బదిలీల ప్రకయలో వికలాంగులు మరియుమెడికల్.పరంగాముందుగా ప్రాధాన్యత ఇచ్చి కౌన్సెలింగ్ ద్వారా బదిలీ చేశామని అన్నారు.ఈ బదిలీలలో సేల్స్ మేన్ లు.ఎం సి డబ్ల్యూవర్కర్లు,డ్రైవర్లకలిపిపదకొండు మందిని కౌన్సిలింగ్ ద్వారా బదిలీ చేశామని అన్నారు.ఈ బదిలీల ప్రక్రియ ఎటువంటి పొరపాట్లు లేకుండా పారదర్శకంగా సిబ్బంది కోరుకున్నచోట బదిలీలు చేయడం జరిగిందని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో ఇన్చార్జి డిఎంజిసిసి సమ్మయ్య,జిసిసి మేనేజర్లు లక్ష్మాజి,జయరాజ్,భూషయ్య,అకౌంటెంట్లు,ఖయ్యూం, డ్రైవర్లు,సేల్స్ మెన్లు,తదితరులు పాల్గొన్నారు.

### ఐకెపి,వివోఏ సమ్మె శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపిన బిఆర్ఎస్ పార్టీ వ్యవస్థాపక సభ్యులు దిండిగాల రాజేందర్.

**అక్షర కలం / ఇల్లందు.**


ఇల్లందు మండలం లో పనిచేస్తున్న ఐకేపీ, సెర్ప్ అనుబంధ వివోఏ ఉద్యోగులు , తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం గత 12 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తూ , నిరాహార దీక్షా కొనసాగిస్తున్న క్రమంలో శుక్రవారం బి ఆర్ ఎస్ పార్టీ వ్యవస్థాపక సభ్యులు, ఖమ్మం ఉమ్మడి జిల్లా మాజీ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు దిండిగాల రాజేందర్ బిఆర్ఎస్ పార్టీ శ్రేణులతో కలిసి నిరాహార దీక్షా శిభిరంను సందర్శించారు.12 రోజులుగా సమ్మె చేస్తున్న వివో ఏ లకు మద్దతు తెలియచేసి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా దిండిగాల రాజేందర్ మాట్లాడుతూ సమ్మె చేస్తున్న వివో ఏ, సెర్ప్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్స్ ను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాక ముందు తమ ఎన్నికల ప్రణాళికలో పొందు పరిచి ఇచ్చిన హామీల మేరకు వివో ఏ ల వేతనాలు పెంచాలని , జీవో నెంబర్,58 ని సవరించాలని , అర్హులైన వివో ఏ లను కమ్యూనిటీ కోఆర్డినేటర్లుగా నియమించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకముందు రాష్ట్రంలోని వివిధ పట్టణాలలో వివిధ వర్గాల ప్రజలకు ఆచరణ సాధ్యం కానీ హామీలు గుప్పించి అధికారంలోకి వచ్చి 2 1/2 సంవత్సరాలు గడిచినా, ఇచ్చిన హామీలను అమలు చేయలేక అన్ని వర్గాల ప్రజలను వంచన చేసి నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నదని, తమ సమస్యల పరిష్కారం కోసం తుది వరకు పోరాటం చేయాలని , బి ఆర్ ఎస్ పార్టీ మీ



సమస్యల పరిష్కారం కోసం అన్ని విధాల సహాయ సహాకారాలు అందిస్తుందని ఆయన భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ఎస్ పార్టీ టౌన్ మాజీ వైస్ ప్రెసిడెంట్ అబ్దుల్ నబీ, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు నారపాక వసంతరావు, పరికపల్లి రవి గౌడ్, రాచపల్లి శీను, సన రాజేష్,మూల గుండ్ల ఉపేందర్ రావ్, లలిత్ కుమార్ పాసి, వంగ సునీల్ కుమార్, శ్రీకాంత్, మునగంటి శివ,సన రాజేష్, గడ్డి శ్రీనివాస్, ఎండి అమీర్, సర్దార్, పాల్గొన్నారు.


అక్షరకలం
తెలుగు దినపత్రిక

## ఆట



# కోహ్లీ సరికొత్త రికార్డు..

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు స్టార్ బ్యాటర్, రన్ మెషిన్ విరాట్ కోహ్లీ ఖాతాలో మరో అద్భుతమైన మైలురాయి చేరింది. ఐపీఎల్ ప్రారంభమైన 2008 సీజన్ నుంచి ఆర్‌సీబీ జట్టుకు నమ్మకమైన పిల్లర్‌గా నిలిచిన కోహ్లీ, ఐపీఎల్ 2026 క్వాలిఫైయర్ 1 మ్యాచ్ ద్వారా సరికొత్త చరిత్ర సృష్టించాడు. మే 26న ధర్మశాల వేదికగా గుజరాత్ టైటాన్స్‌తో జరుగుతున్న ఈ కీలక పోరులో బరిలోకి దిగడం ద్వారా, ఐపీఎల్ చరిత్రలోనే అత్యధిక ప్లేఆఫ్స్ మ్యాచ్‌లు ఆడిన దిగ్గజాల సరసన కోహ్లీ చోటు సంపాదించుకున్నాడు.ఐపీఎల్ చరిత్రను తిరగేస్తే విరాట్ కోహ్లీ పేరిట లేని రికార్డు అంటూ లేదు. ఈ మెగా టోర్నీలో ఇప్పటివరకు అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా కోహ్లీనే అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. అతను మొత్తం 9218 పరుగులు చేసి ఎవరికీ అందనంత ఎత్తులో నిలిచాడు. అంతేకాదు, ఐపీఎల్‌లో అత్యధిక హాఫ్ సెంచరీలు (76 హాఫ్ సెంచరీలు) చేసిన రికార్డు కూడా కోహ్లీ పేరిటే ఉంది. అతని తర్వాత డేవిడ్ వార్నర్ ఉండగా, ప్రస్తుతం ఆడుతున్న యాక్టివ్ ప్లేయర్లలో కేఎల్ రాహుల్ 51 హాఫ్ సెంచరీలతో రెండో స్థానంలో ఉన్నాడు. ఈ గణాంకాలే ఐపీఎల్‌లో కోహ్లీ సృష్టించిన సామ్రాజ్యానికి అద్దం పడుతున్నాయి.తాజాగా గుజరాత్ టైటాన్స్‌తో జరుగుతున్న క్వాలిఫైయర్ 1 మ్యాచ్‌తో కలిపి విరాట్ కోహ్లీ తన కెరీర్‌లో 18వ ఐపీఎల్ ప్లేఆఫ్ మ్యాచ్ ఆడుతున్నాడు. దీనితో అతను శిఖర్ ధావన్, దినేష్ కార్తీక్, కీరన్ పొలార్డ్ వంటి దిగ్గజాల రికార్డును సమం చేశాడు. ఐపీఎల్ ప్లేఆఫ్స్‌లో అత్యధిక మ్యాచ్‌లు ఆడిన ఆటగాడిగా చెన్నై సూపర్ కింగ్స్ మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ 28 మ్యాచ్‌లతో టాప్‌లో ఉన్నాడు. ఆ తర్వాతి స్థానాల్లో రవిచంద్రన్ అశ్విన్ (24 మ్యాచ్‌లు), సురేష్ రైనా (24 మ్యాచ్‌లు), రోహిత్ శర్మ (23 మ్యాచ్‌లు), అంబటి రాయుడు (23 మ్యాచ్‌లు), రవీంద్ర జడేజా (23 మ్యాచ్‌లు), డ్వేన్ బ్రావో (19 మ్యాచ్‌లు) ఉన్నారు. ఇప్పుడు వారి వెనుకే విరాట్ కోహ్లీ కూడా చేరిపోయాడు. ఐపీఎల్ నాకౌట్ స్టేజ్‌లో విరాట్ కోహ్లీ ప్రదర్శనపై భిన్నమైన రికార్డులు ఉన్నాయి. ఆర్‌సీబీ తరఫున అతను ఇప్పటివరకు 4 ఐపీఎల్ ఫైనల్ మ్యాచ్‌లు ఆడాడు. ఫైనల్స్ లో కోహ్లీ 34.75 సగటుతో, 126.36 స్ట్రైక్ రేట్‌తో పర్వాలేదనిపించేలా రాణించాడు. అయితే ఎలిమినేటర్ మ్యాచ్‌ల విషయానికి వస్తే మాత్రం కోహ్లీ ట్రాక్ రికార్డు అంత ఆశాజనకంగా లేదు. ఆడిన 5 ఎలిమినేటర్ మ్యాచ్‌లలో అతను కేవలం 23.00 సగటు, 108.49 పేలవమైన స్ట్రైక్ రేట్‌తో పరుగులు చేశాడు. ఈ స్లో బ్యాటింగ్ కారణంగా గతంలో ఆర్‌సీబీ కొన్ని కీలక మ్యాచ్‌లలో ఓటమి పాలుకావాల్సి వచ్చింది. పాత రికార్డులు ఎలా ఉన్నప్పటికీ, ప్రస్తుత ఐపీఎల్ 2026 సీజన్‌లో మాత్రం విరాట్ కోహ్లీ వీరవిహారం చేస్తున్నాడు. ఈ సీజన్‌లో ఆడిన 14 లీగ్ మ్యాచ్‌లలో అతను 50కి పైగా అద్భుతమైన సగటుతో, 162.03 స్కై-హై స్ట్రైక్ రేట్‌తో పరుగుల వరద పారించాడు. ఆర్‌సీబీ జట్టు వరుస విజయాలతో ప్లేఆఫ్స్ క్వాలిఫైయర్ 1 కి చేరుకోవడంలో కోహ్లీ బ్యాటింగే ప్రధాన బలమైంది. ఇదే ఫామ్‌ను గుజరాత్‌పై కూడా కొనసాగించి, ఆర్‌సీబీని ఫైనల్‌కు చేర్చడమే లక్ష్యంగా కింగ్ కోహ్లీ బరిలోకి దిగాడు.






# రియాన్ పరాగ్, వైభవ్ సూర్యవంశీ మధ్య కోల్డ్ వార్..?

ఐపీఎల్ 2026 ప్లేఆఫ్స్ ఉత్కంఠ రేపుతున్న వేళ రాజస్థాన్ రాయల్స్ క్యాంప్‌లో తీవ్ర కలకలం రేగింది. మైదానంలో పరుగుల వరద పారిస్తున్న సంచలన బ్యాటర్ వైభవ్ సూర్యవంశీ, జట్టు కెప్టెన్ రియాన్ పరాగ్ మధ్య విభేదాలు భగ్గుమన్నట్లు సోషల్ మీడియాలో ఒక వీడియో వైరల్‌గా మారింది. ముంబై విమానాశ్రయంలో ఇద్దరు ఆటగాళ్ల మధ్య జరిగిన ఈ ఆసక్తికర ఘటనే ఇప్పుడు క్రికెట్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, సన్‌రైజర్స్ హైదరాబాద్, గుజరాత్ టైటాన్స్ తర్వాత ఈ ఏడాది ప్లేఆఫ్స్ చేరిన నాలుగో జట్టుగా రాజస్థాన్ రాయల్స్ నిలిచింది. బుధవారం న్యూ చండీగఢ్ వేదికగా సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరగబోయే ఎలిమినేటర్ మ్యాచ్ కోసం జట్టు ముంబై నుంచి చండీగఢ్‌కు విమానంలో ప్రయాణమైంది. లీగ్ దశ చివరి మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్‌ను ఓడించిన ఉత్సాహంలో ఉన్న రాయల్స్ ఆటగాళ్లు విమానాశ్రయానికి చేరుకున్నప్పుడు ఈ వివాదం చోటుచేసుకుంది. ముంబై అంతర్జాతీయ విమానాశ్రయంలో ఆటగాళ్ల ఫొటోలను తీసేందుకు మీడియా ప్రతినిధులు, ఫోటోగ్రాఫర్లు ఎగబడ్డారు. ఈ క్రమంలో ఒక ఫోటోగ్రాఫర్ కెప్టెన్ రియాన్ పరాగ్, యువ సంచలనం వైభవ్ సూర్యవంశీలను కలిసి ఒక ఫోటో ఇవ్వాల్సిందిగా కోరాడు. దీనికి పరాగ్ తనదైన శైలిలో స్పందిస్తూ, “మేమేమీ సినిమా స్టార్లం కాదు” అంటూ ఫోటో ఇవ్వడానికి నిరాకరించాడు. పరాగ్ చేసిన ఈ వ్యాఖ్య పక్కనే ఉన్న 15 ఏళ్ల వైభవ్‌కు నచ్చలేదు. దాంతో ఆయన తన కెప్టెన్‌ను ఎంతో సీరియస్‌గా, కోపంగా చూస్తూ ఉండిపోయాడు. ఈ చూపుల యుద్ధానికి సంబంధించిన వీడియో నెట్టింట వైరల్ కావడంతో ఇద్దరి మధ్య ఏదో నడుస్తోందనే ప్రచారం ఊపందుకుంది.ఈ సీజన్లో రాజస్థాన్ రాయల్స్ జట్టును వైభవ్ సూర్యవంశీ ఒంటిచేత్తో ముందుకు నడిపిస్తున్నాడు. కేవలం 15 ఏళ్ల వయసులోనే జస్‌ప్రీత్ బుమ్రా, పాట్ కమిన్స్, మిచెల్ స్టార్క్, సునీల్ నరైన్ వంటి ప్రపంచ స్థాయి బౌలర్లను నెట్ బౌలర్లకంటే హీనంగా బాదేస్తున్నాడు.

అక్షరకలం
తెలుగు దినపత్రిక




## సినిమా

CINEMA


# బుచ్చిబాబు కోసం పెద్దిలో నటించా: దివ్యేందు

'పెద్ది' డైరెక్టర్ బుచ్చిబాబుపై ప్రశంసలు కురిపించారు బాలీవుడ్ నటుడు దివ్యేందు శర్మ. ఆయన కోసమైనా 'పెద్ది' చేయాలని అనుకున్నట్లు చెప్పారు. రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు తెరకెక్కించిన చిత్రం 'పెద్ది'. ఇందులో దివ్యేందు శర్మ కీలక పాత్రలో నటించారు. జూన్ 4న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో ప్రచారంలో భాగంగా దివ్యేందు ఇంటర్వ్యూల్లో పాల్గొన్నారు. ఈ సినిమా అంగీకరించడానికి కారణం వెల్లడించారు. తాను ఉత్తరాఖండ్‌లో షూటింగ్‌లో ఉన్నప్పుడు ఈ చిత్ర బృందం నుంచి ఫోన్ వచ్చింది. వీలున్నప్పుడు వస్తాను అని చెప్పా. తర్వాత 'మిమ్మల్ని కలవాలి' అని బుచ్చిబాబు చాలా మెసేజ్‌లు పెట్టారు. దీంతో నేను ఆ షూట్ మధ్యలోనే ఆపేసి ఎంతోసేపు ప్రయాణించి చాలా కష్టపడి అక్కడినుంచి ఇక్కడికి వచ్చాను. బుచ్చిబాబును చూసి ఆశ్చర్యపోయాను. ఎంతో ప్రేమతో వ్యవహరించారు. కళకు ఎంత గౌరవం ఇస్తారో చూశాను. నా పాత్రను వివరించేటప్పుడే నిర్ణయించుకున్నా. ఈ సినిమా ఎలా ఉన్నా బుచ్చిబాబు కోసం చేయాలి అని. వెంటనే ఓకే చేశా. ఆయన నన్ను అంత ప్రభావితం చేశారు' అని దివ్యేందు తెలిపారు. ఇక పెద్ది కథ గురించి మాట్లాడుతూ..'స్టోరీ చూసి షాక్ అయ్యాను.



# చెన్నై లవ్‌స్టోరీ నుంచి నిను వదలనే ..సెకండ్ సింగిల్ విడుదల

నిమిషమైనా నిను వదలనే.. అంటూ తన మ్యూజిక్‌తో మ్యాజిక్ క్రియేట్ చేశారు మణిశర్మ. కిరణ్ అబ్బవరం ప్రధానపాత్రలో రవి నంబూరి దర్శకత్వంలో రానున్న చిత్రం 'చెన్నై లవ్‌స్టోరీ'. తాజాగా ఈసినిమా నుంచి సెకండ్ సింగిల్‌ను టీమ్ విడుదల చేసింది. 'నను నేను వదిలినా.. నిను వదలనే..' అంటూ సాగే లిరిక్స్ అనంత్ శ్రీరామ్ అందించగా.. జావెద్ అలీ తన గాత్రంతో మరోస్థాయికి తీసుకెళ్లారు. యూత్‌కు కనెక్ట్ అయ్యేలా ఉన్న ఈ పాటను తీర్చిదిద్దారు. తెలుగు సినీ పరిశ్రమలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుంటున్న యువ నటి శ్రీ గౌరి ప్రియ. వరుసగా విభిన్న పాత్రలతో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న ఈ తెలుగమ్మాయి ప్రస్తుతం హీరో కిరణ్ అబ్బవరంతో కలిసి 'చెన్నై లవ్ స్టోరీ' చిత్రంలో నటిస్తోంది. తాజాగా ఈ సినిమా నుంచి విడుదలైన 'వదలనే' పాట లాంచ్ ఈవెంట్‌లో శ్రీ గౌరి ప్రియ చేసిన వ్యాఖ్యలు అందరినీ భావోద్వేగానికి గురి చేశాయి. ఈ పాటలోని లిరిక్స్‌ను ఎవరికి అంకితం చేస్తారని ప్రశ్నించగా, శ్రీ గౌరి ప్రియ సమాధానం ఇస్తూ ఒక్కసారిగా భావోద్వేగానికి లోనైంది. నిజంగా చెప్పాలంటే మా అమ్మ నన్ను వదిలేసి మూడేళ్లు అయింది. కానీ తను నన్ను అసలు వదల్లేదు. నేను కూడా తనను ఎప్పటికీ వదలను. ఈ విషయం తనకు తెలుసు, నాకు తెలుసు. ఈ పాటలోని లైన్స్‌ను మా అమ్మకే అంకితం చేస్తున్నాను' అని చెప్పింది. ఆమె మాటలు విన్న వెంటనే కార్యక్రమంలో ఉన్నవారు కొద్దిసేపు నిశ్శబ్దంగా మారిపోయారు. సోషల్ మీడియాలో ఈ వీడియో వేగంగా వైరల్ అవుతోంది. మూడేళ్ల క్రితం శ్రీ గౌరి ప్రియ తల్లి వసుంధర క్యాన్సర్ కారణంగా మరణించారు. తల్లితో తనకు చాలా ఆత్మీయ అనుబంధం ఉండేదని గౌరి ప్రియ పలు సందర్భాల్లో వెల్లడించింది. ఆమెను కేవలం తల్లిగానే కాకుండా ఒక మంచి స్నేహితురాలిగా భావించేదని చెప్పింది. తల్లి మరణంతో కొంతకాలం తీవ్ర మానసిక వేదనకు గురైన ఆమె, ఆ తర్వాత మళ్లీ తన కెరీర్‌పై దృష్టి పెట్టింది. హీరో కిరణ్ అబ్బవరం ప్రధాన పాత్రలో నటిస్తున్న 'చెన్నై లవ్ స్టోరీ' చిత్రానికి రవి నంబూరి దర్శకత్వం వహిస్తున్నారు. సంగీత దర్శకుడు మణిశర్మ స్వరాలు అందిస్తున్నారు.





# విశ్వంభర విడుదల తేదీపై అస్పష్టత

మెగాస్టార్ చిరంజీవి ప్రస్తుతం వరుస సినిమాలతో ఫుల్ బిజీగా ఉన్నారు. మెగాస్టార్ అభిమానులను ఎక్కువగా కలవరపెడుతున్న విషయం మాత్రం 'విశ్వంభర' మూవీ గురించే. ఎందుకంటే ఈ ప్రాజెక్ట్ చాలా కాలం క్రితమే ప్రారంభమై, షూటింగ్ కూడా పూర్తయిన దశకు చేరుకున్నప్పటికీ.. ఇప్పటివరకు విడుదల తేదీపై స్పష్టత రాకపోవడం అభిమానుల్లో అనుమానాలు పెంచుతోంది. దర్శకుడు వశిష్ట తెరకెక్కిస్తున్న 'విశ్వంభర' మెగాస్టార్ కెరీర్‌లో అత్యంత భారీ ఫాంటసీ చిత్రాల్లో ఒకటిగా రూపొందుతోంది. విజువల్ ఎఫెక్ట్స్, గ్రాండియర్ సెట్స్, భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమాపై మొదటి నుంచే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటికే షూటింగ్ దాదాపు పూర్తయిందని వార్తలు వచ్చినప్పటికీ, సినిమా రిలీజ్ విషయంలో మాత్రం ఎలాంటి అధికారిక ప్రకటన లేకపోవడం అభిమానులను నిరాశకు గురిచేస్తోంది. మొదట ఈ సినిమాను సమ్మర్ రిలీజ్‌గా తీసుకురానున్నట్లు ప్రచారం జరిగింది. అయితే ప్రస్తుతం పరిస్థితులు చూస్తుంటే ఆ ప్లాన్ అమలు అయ్యే అవకాశాలు కనిపించడం లేదు. సినిమా నుంచి పెద్దగా అప్‌డేట్లు కూడా లేకపోవడంతో సోషల్ మీడియాలో ఫ్యాన్స్ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 'విశ్వంభర' ఆలస్యానికి ప్రధాన కారణం విజువల్ ఎఫెక్ట్స్ పనులేనని టాక్ వినిపిస్తోంది.

అక్షరకలం
తెలుగు దినపత్రిక
నల్లగొండ-సూర్యాపేట-యాదాద్రి

# దివ్యాంగుల పునరావాస కేంద్రాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్



యాదాద్రి భువనగిరి అక్షర కలం

యాదగిరిగుట్ట మండలం వంగపల్లి గ్రామంలోని దివ్యాంగుల పునరావాస కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కేంద్రంలో అందిస్తున్న సేవలు, పిల్లలకు కల్పిస్తున్న సౌకర్యాలపై నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. దివ్యాంగుల పునరావాస కేంద్రంలో ప్రస్తుతం ఎంత మంది పిల్లలు ఉన్నారని, ఏఏ వయస్సు వారు ఉన్నారని వివరాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే పిల్లల సంరక్షణ, శిక్షణ కోసం ఎంత మంది సిబ్బంది పనిచేస్తున్నారని తెలుసుకున్నారు. పిల్లలకు అందిస్తున్న విద్య, పునరావాస సేవలు, ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా కేంద్రానికి నిర్మిస్తున్న నూతన భవన పనులను పరిశీలించారు. భవన నిర్మాణం త్వరగా పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఇంకా కేంద్రానికి అవసరమైన సదుపాయాలు ఏమున్నాయో వివరాలు అడిగి తెలుసుకొని, అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ విద్యా సంవత్సరంలో కేంద్రం నుండి పదవ తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థిని జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షిస్తూ ప్రోత్సహించారు. దివ్యాంగ పిల్లలకు విద్యతో పాటు ఆత్మవిశ్వాసం కల్పించడం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలోజిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నాగిరెడ్డి, అధికారులు రమణ, సెంటర్ నిర్వాహకులు పాల్గొన్నారు.

# నిబంధనలకు విరుద్ధంగా నియామకాలు

## ఎంజియూలో అక్రమ ఔట్‌సోర్సింగ్ నియామకాలపై విచారణ జరిపించాలి

## ఉన్నత విద్యా మండలి చైర్మన్‌కు బిఆర్ఎస్వీ వినతి

అక్షరకలం నల్గొండ

మహాత్మా గాంధీ యూనివర్సిటీలో ఇటీవల చేపట్టిన ఔట్‌సోర్సింగ్ నియామకాల్లో భారీ అవినీతి, అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ యూనివర్సిటీ విద్యార్థి సంఘ నాయకులు తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ జిట్టా బాలకృష్ణ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. బిఆర్ఎస్వీ యూనివర్సిటీ అధ్యక్షులు వాడపల్లి నవీన్ నేతృత్వంలో విద్యార్థి సంఘ నాయకులు శుక్రవారం హైదరాబాద్‌లో చైర్మన్‌ను కలిసి విశ్వవిద్యాలయంలో జరుగుతున్న అక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘ నాయకులు మాట్లాడుతూ.. యూనివర్సిటీలో నిర్వహించిన ఔట్‌సోర్సింగ్ నియామకాలు పూర్తిగా నిబంధనలకు విరుద్ధంగా జరిగాయని ఆరోపించారు. రోస్టర్ రిజర్వేషన్ విధానాన్ని పూర్తిగా పక్కనబెట్టారని మండిపడ్డారు. నియామకాలకు సంబంధించి ఎలాంటి పత్రికా ప్రకటనలు (నోటిఫికేషన్లు) సరైన విధంగా ఇవ్వలేదని తెలిపారు. అర్హులైన నిరుద్యోగ యువతకు అవకాశం లేకుండా ఈ ప్రక్రియను ముగించారని ధ్వజమెత్తారు. ఇప్పటికే ఈ అంశంపై యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ (వీసీ), రిజిస్ట్రార్‌కు పలుమార్లు వినతిపత్రాలు అందజేసినా






అధికారుల నుండి ఎలాంటి స్పందన లేకపోవడంతోనే, ఉన్నత విద్యా మండలి చైర్మన్‌ను కలిసి పూర్తి వివరాలను సమర్పించినట్లు వారు పేర్కొన్నారు. గతంలో నవీన్ మిట్టల్ వైస్ ఛాన్సలర్‌గా ఉన్న సమయంలో కూడా రోస్టర్ రిజర్వేషన్, పత్రికా ప్రకటనలు లేకుండా 33 మందిని డైలీ వేజ్ ఉద్యోగులుగా అక్రమంగా నియమించారు. ప్రస్తుతం చేపట్టిన నియామకాలలో కూడా నిరుద్యోగుల వద్ద లక్షల రూపాయలు వసూలు చేసి, 100కు పైగా అక్రమ నియామకాలకు తెరలేపారని తెలిపారు.

### ఏజెన్సీని బ్లాక్‌లిస్ట్ లో పెట్టాలి..

అక్రమాలకు పాల్పడిన సదరు ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, భవిష్యత్తులో ఆ ఏజెన్సీకి యూనివర్సిటీ లేదా ఇతర ప్రభుత్వ సంస్థల్లో పనులు ఇవ్వకుండా బ్లాక్‌లిస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం జరిగిన నియామకాలను పూర్తిగా రద్దు చేయాలి. తిరిగి పారదర్శకంగా నోటిఫికేషన్ విడుదల చేసి, అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు స్వీకరించి, ప్రతిభ ప్రాతిపదికన నాణ్యత కలిగిన విద్యావంతులను ఎంపిక చేయాలని డిమాండ్ చేశారు.

### చైర్మన్ సానుకూల స్పందన..

విద్యార్థుల ఫిర్యాదును స్వీకరించిన తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ జిట్టా బాలకృష్ణ రెడ్డి సానుకూలంగా స్పందించారు. ఈ ఔట్‌సోర్సింగ్ నియామకాల అంశంపై సమగ్ర విచారణ జరిపించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకునేలా యూనివర్సిటీ అధికారులతో చర్చిస్తామని ఆయన హామీ ఇచ్చినట్లు విద్యార్థి నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘ నాయకులు పోలగొని శివ, రాజేష్, యశ్వంత్, రామ్, జితేందర్, సంజీవ,పలువురు నిరుద్యోగ యువకులు పాల్గొన్నారు.

# స్వయం ఉపాధి పై యువత ఆసక్తి పెంచుకోవాలి

## కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు గోలి పింగల్ రెడ్డి



అక్షరకలం బీబీనగర్

స్వయం ఉపాధి అవకాశాలను సృష్టించుకొని, యువత ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు గోలి పింగల్ రెడ్డి అన్నారు. శుక్రవారం బీబీనగర్ శివారులోని ఎయిమ్స్ ఆసుపత్రి ఆవరణలో పెంట మల్లేష్ ఏర్పాటు చేసిన ఎస్ ఎల్ ఎన్ ఎస్ హోటల్ ను పింగల్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులకు నాణ్యమైన ఆహార పదార్థాలను అందించి మంచిపేరు తెచ్చుకోవాలని హోటల్ యాజమాన్యానికి సూచించారు. కార్యక్రమంలో బీబీనగర్ గ్రామ సర్పంచ్ పంజాల శ్రీనివాస్ గౌడ్, వార్డు సభ్యులు బుర్రి సుదర్శన్, నాయకులు ఎం డి అక్బర్, పిట్టల అశోక్, తుమ్మల నర్సింహ రెడ్డి పాల్గొన్నారు.

# ప్రజల భాగస్వామ్యంతోనే ప్రగతి సాధ్యం

## జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్

## ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక'లో ఇందిరమ్మ చీరల పంపిణీ.. 64 మందికి కుక్క పిల్లల దత్తత

ఉమ్మడి నల్లగొండ బ్యూరో అక్షరకలం



ప్రజల భాగస్వామ్యంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని జిల్లా



కలెక్టర్ బి.చంద్రశేఖర్ అన్నారు. ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం లో భాగంగా శుక్రవారం నల్గొండ జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్పొరేషన్ ఆవరణలో నిర్వహించిన ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నదని, వీటన్నిటిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు. అంతేకాక ప్రభుత్వ అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలలో ప్రజల భాగస్వామ్యం ఉన్నప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. ప్రభుత్వ కార్యక్రమాల విజయవంతానికి అందరూ సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో 64 కుక్కల ప్రేమికులకు కుక్క పిల్లలను దత్తత ఇచ్చారు. కుక్క పిల్లల దత్తత పై జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జంతువులలో కుక్క అత్యంత విశ్వాసమైనదని అన్నారు. వీటిని మనం కాపాడుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. అదే సమయంలో రానున్న వానా కాలం కుక్కకాట్లు ఎక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని, కుక్కకాట్ల పట్ల జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. ముఖ్యంగా వీధులలో ఎక్కడపడితే అక్కడ ఆహార పదార్థాలు, చెత్తాచెదారం వేయడం వల్ల రోడ్డుపై చెత్త వేయడం కాలనీలో వేయడం వల్ల ఆహారం కోసం కుక్కలు విధులలోకి వస్తాయని, అదే సమయంలో చిన్న పిల్లలు, పాఠశాల పిల్లలు కుక్కకాటుకు గురయ్యే అవకాశం ఉందని, దీనిని దృష్టిలో ఉంచుకొని వీధులలో చెత్తా,చెదారం లేకుండా శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. నల్గొండ జిల్లాలో జంతు జనన కేంద్రం ఉన్నందున ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమం నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ కుక్కలను దత్తతగా పొందినవారు వాటిని కాపాడుకోవాలని ,వాటిని వీధిలోకి వదలకుండా ఇంట్లోనే పెంచుకోవాలని, సమయానికి వాటికి ఆహారం అందిస్తూ చక్కగా పెంచుకోవాలని సూచించారు. ప్రజలు కుక్కల పట్ల అవగాహన పెంచుకోవాలని, కుక్క కాటుకు గురికాకుండా తగు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ కమిషనర్ శరత్ చంద్ర, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ రమేష్, తదితరులు హాజరయ్యారు.

# విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలి: దేవరకొండ డీఎస్పీ శ్రీనివాసరావు

అక్షరకలం దేవరకొండ,

విద్యార్థులు పట్టుదల, క్రమశిక్షణతో కూడిన లక్ష్యాలను ఏర్పరచుకొని సమాజంలో ఉన్నత స్థాయికి ఎదగాలని దేవరకొండ డీఎస్పీ శ్రీ శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం దేవరకొండ నియోజకవర్గ కమిటీ ఆధ్వర్యంలో, సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ అధ్యక్షతన పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీఎస్పీ శ్రీనివాసరావు విద్యార్థులను ఆత్మీయంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిభావంతులైన విద్యార్థులను గుర్తించి బీసీ సంక్షేమ సంఘం సత్కరించడం అభినందనీయమన్నారు. సమాజ సేవను లక్ష్యంగా చేసుకుని విద్యార్థులు ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ మాతృనాయక్, కొండ్ర శ్రీశైలం యాదవ్, ఏకుల రాజారావు, రెడ్డి కోటేశ్వరరావు, ఎండి రంజాన్ బెగ్, పున్న వెంకటేష్ నేత, నట్టువ



సుధాకర్, గరిడి విజయభాస్కర్, పొన్నం బిక్షమయ్య, లౌడ్య భాష నాయక్, ఎండి అబ్దుల్ కలాం, మెరుగు శ్రీను, వరికుప్పల శ్రీను, కుంభం బాలచందర్, మెరుగు పెద్దయ్య యాదవ్, పల్చా శ్రీనివాస్ గౌడ్, వివిధ పాఠశాలల ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు మరియు బీసీ, ప్రజా సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రైతులకు వరం.. సగం ధరకే 'పచ్చిరొట్ట' విత్తనాలు

## నల్గొండ కలెక్టర్ చంద్రశేఖర్

## జీలుగ, జనుము విత్తనాల విక్రయ కేంద్రాన్ని ప్రారంభించిన కలెక్టర్

## జిల్లాకు 4 వేల క్వింటాళ్ల విత్తనాలు సరఫరా

ఉమ్మడి నల్గొండ బ్యూరో అక్షరకలం

రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీపై అందజేస్తున్న పచ్చిరొట్ట ఎరువులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ కోరారు. శుక్రవారం అయన నల్గొండ జిల్లా కేంద్రంలోని క్లాక్ టవర్ వద్ద ఉన్న నాగార్జున జిల్లా సహకార మార్కెటింగ్ సంఘం లిమిటెడ్ ఆవరణలో ఏర్పాటుచేసిన పచ్చి రొట్ట ఎరువుల విత్తనాల అమ్మకం కేంద్రాన్ని ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం పచ్చి రొట్ట ఎరువులను సబ్సిడీపై అందజేస్తున్నదని, జీలుగ విత్తనాలు కిలో 163.50 రూపాయల చెల్లించాల్సి ఉండగా, ప్రభుత్వం కిలోకు 81.75 పైసలు సబ్సిడీ ఇస్తుందని, సబ్సిడీ తర్వాత రైతు కిలోకు 81.75 పైసలు చెల్లించాల్సి ఉంటుందని, 30 కిలోల బ్యాగు 2,452.50 రూపాయలు వెచ్చించి కొనుగోలు చేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. అలాగే జనుము విత్తనాలకు సంబంధించి కిలో 155.60 ధర ఉండగా, ప్రభుత్వం కిలోకు 77.75 రూపాయల సబ్సిడీ ఇస్తుందని, తక్కిన 77.75 పైసలు రైతు చెల్లించి కొనాల్సి ఉంటుందని, 40 కేజీల జనుము విత్తనాల బ్యాగును రైతులు3110 రూపాయలు చెల్లించి కొనుగోలు చేయాల్సి ఉంటుందన్నారు. పచ్చిరొట్ట ఎరువుల వల్ల సాంద్రత పెరుగుతుందని, అలాగే నేలలో శక్తి, సారవంతం పెరుగుతాయని, తద్వారా పంట దిగిబడి పెరుగుతుందని కలెక్టర్ తెలిపారు. అందువల్ల రైతులు వచ్చిరోట్ట ఎరువులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వం ద్వారా జిల్లాకు 3500 క్వింటాళ్ల జీలుగ, 500 క్వింటాళ్ల జనుము విత్తనాలు వచ్చాయని, వీటిని జిల్లాలోని వివిధ మండలాలకు పంపడం జరిగిందని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి గుమ్మల మోహన్ రెడ్డి, లక్ష్మయ్య, ఇతర ప్రజా ప్రతినిధులు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రవణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



అక్షరకలం
తెలుగు దినపత్రిక
నల్లగొండ-సూర్యాపేట-యాదాద్రి

# వరి కొయ్యలను తగలబెడితే కఠిన చర్యలు

## జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్, ఎస్పీ శరత్ చంద్ర పవర్ హెచ్చరిక

## గిరక బావి గూడెంలో రైతులతో మాట్లాడిన కలెక్టర్

## నిప్పు పెడితే భూసారం దెబ్బతింటుందని వెల్లడి





అక్షరకలం నల్గొండ

రైతులు వరి పంట కోసిన తర్వాత పొలం పై ఉన్న వరి కొయ్యలను కాల్చడం వల్ల అనేక దుష్పరిణామాలు సంభవిస్తాయని, అందువల్ల ఎవరు వరి కొయ్యలను తగలబెట్టవద్దని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం అయన నల్గొండ జిల్లా కేంద్రం సమీపంలో ఉన్న గిరక బావి గూడెంలో రైతులు వరి కొయ్యలను పొలంపైనే తగలబెడుతున్నారని తెలుసుకొని అక్కడికి వెళ్లి రైతులతో మాట్లాడారు. వరికోయ్యలు తగలబెడితే భూమి సారవంతం కోల్పోతుందని, అనంతరం దుక్కి దున్నినప్పటికీ గుల్లగా మారదని, దీనివల్ల పంట దిగుబడి తగ్గుతుందని అన్నారు. వరి కొయ్యలను కాల్చడం వల్ల వాతావరణ కాలుష్యంతో పాటు, రహదారులపై వెళ్లే వాహనదారులకు కూడా ఇబ్బందులు ఏర్పడతాయని, వరి కొయ్యల వల్ల పక్కన ఉన్న చెట్లు, ఇతర విలువైన వస్తువులు పరికరాలు తగలబడే అవకాశం ఉందని, వీటన్నిటిని దృష్టిలో ఉంచుకొని రైతులు ఎట్టి పరిస్థితులలో వరి కోయ్యలను తగలబెట్ట వద్దన్నారు. ఇటీవల కాలంలో జిల్లాలో వరి కొయ్యలను తగలబెట్టడం వలన ప్రాణాపాయం సంభవించిన విషయాలను ఆయన గుర్తు చేశారు. రైతులు వరికొయ్యలను తగలబెట్టకుండా ఉండేందుకుగాను వ్యవసాయ శాఖ ద్వారా అవగాహన కల్పిస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్ మాట్లాడుతూ వరి కొయ్యలను పొలం పైన తగలబెట్టడం వల్ల పర్యావరణ సమతుల్యం దెబ్బతినడమే కాకుండా, భూములు సారవంతం కోల్పోతాయని, అందువల్ల ఎవరు తగలబెట్టవద్దని చెప్పారు. ఎవరైనా ఇలా వరి కొయ్యలు తగలబెట్టడం వల్ల ప్రమాదాల సంభవిస్తే అందుకు బాధ్యులైన వారిపై కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు. జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్, తదితరులు జిల్లా కలెక్టర్, ఎస్పీ వెంట ఉన్నారు.

# ప్రభుత్వ పాఠ్యపుస్తకాల విక్రయం

## బుక్ షాపుల రిజిస్ట్రేషన్‌కు దరఖాస్తుల ఆహ్వానం

అక్షరకలం నల్గొండ

నల్గొండ జిల్లాలోని గుర్తింపు పొందిన పాఠశాలల్లో 1 నుండి 10వ తరగతి వరకు విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు 2026 -27 విద్యా సంవత్సరానికి గాను ప్రభుత్వ పాఠ్యపుస్తకాలను విక్రయించడానికి నల్లగొండ జిల్లా విద్యాశాఖ దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. జిల్లాలోని గుర్తింపు పొందిన బుక్ షాపుల యాజమానులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి బిక్షపతి ఒక ప్రకటనలో తెలిపారు. ?ఆసక్తి గల యజమానులు జూన్ 5 లోపు తమ దరఖాస్తులను నల్లగొండలోని జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో సమర్పించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. దరఖాస్తుతో పాటు బుక్ షాప్ రిజిస్ట్రేషన్ ధృవీకరణ పత్రం.?యజమాని ఆధార్ కార్డ్, పాన్ కార్డ్,జి యస్ టి రిజిస్ట్రేషన్ పత్రం.గత మూడు సంవత్సరాల ఇన్కమ్ టాక్స్ స్టేట్‌మెంట్స్.జిల్లా విద్యాశాఖాధికారి, నల్లగొండ పేరున రూ. 3,500 డిమాండ్ డ్రాఫ్ట్ (డిడి ) తీసి దరఖాస్తుతో పాటు అందజేయాలని, నిర్ణీత గడువు దాటిన తర్వాత వచ్చే దరఖాస్తులను ఎట్టి పరిస్థితుల్లోనూ స్వీకరించబోమని స్పష్టం చేసారు.

# జూన్ 1 నుండి ఎంజీయూ పీజీ కళాశాలల పునఃప్రారంభం -- రిజిస్ట్రార్ అంజిరెడ్డి

మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయ పరిధిలోని పీజీ కళాశాలలు జూన్ 1 నుండి పునఃప్రారంభం కానున్నాయని రిజిస్ట్రార్ ఆచార్య కొప్పుల అంజిరెడ్డి ఒక ప్రకటన లో తెలిపారు. వేసవి సెలవుల అనంతరం ఈ తరగతులు మళ్లీ మొదలవుతున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు విధిగా 75శాతం హాజరు కలిగి ఉండాలని, కళాశాలలు ఖచ్చితమైన విద్యా ప్రమాణాలు పాటించాలని ఆయన స్పష్టం చేశారు.

# వరి కొయ్యలకు నిప్పు పెడితే కఠిన చర్యలు తీసుకుంటాం : ఎస్సై డి. నాగరాజు

అక్షర కలం : రామన్నపేట



రైతు సోదరులు పొలాల్లో వరి కోతల అనంతరం మిగిలిన ఎండిన వరి కొయ్యలకు (రైస్ స్ట్రా) నిప్పు పెట్టవద్దని రామన్నపేట స్టేషన్ హౌస్ ఆఫీసర్ డి. నాగరాజు గురువారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ప్రస్తుత వేసవి కాలంలో వేడి గాలులు తీవ్రంగా వీస్తున్నందున, పొలాల్లో పెట్టే మంటలు క్షణాల వ్యవధిలో విస్తరించే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎస్సై నాగరాజు మాట్లాడుతూ ఎండిన వరి కొయ్యలకు, ఇళ్ల సమీపంలో ఉన్న చెత్తాచెదరానికి నిప్పు పెట్టడం అత్యంత ప్రమాదకరమని హెచ్చరించారు. వేడి గాలుల తీవ్రతకు మంటలు ఎగిసిపడి, పక్కనే ఉన్న గడ్డివాములకు, నివాస గృహాలకు అంటుకునే అవకాశం ఎక్కువగా ఉందన్నారు. దీనివల్ల భారీ ఆస్తి నష్టంతో పాటు ప్రాణ నష్టం కూడా సంభవించే ముప్పు ఉందని, రైతులు, గ్రామస్థులు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని, చేతులారా ప్రమాదాలను కొని తెచ్చుకోవద్దని సూచించారు. ప్రకృతిని కాపాడితే అది మన ప్రాణాలను కాపాడుతుంది. మన గ్రామాన్ని పచ్చగా, సురక్షితంగా ఉంచుకోవడం మనందరి బాధ్యత" అని ఆయన పేర్కొన్నారు. నిబంధనలను ఉల్లంఘించి ఎవరైనా వరి కొయ్యలకు నిప్పు పెడితే పర్యావరణ పరిరక్షణ చట్టం, ప్రభుత్వ ఆదేశాల ప్రకారం వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. గ్రామాల్లో ఇలాంటి ఉల్లంఘనలు జరిగితే పోలీసులకు సమాచారం అందించాలని ఆయన కోరారు.

# చిట్యాల లో షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం.

అక్షర కలం : చిట్యాల



నల్గొండ జిల్లా చిట్యాల మున్సిపాలిటీ పరిధిలో శుక్రవారం ప్రమాదం తప్పింది. షార్ట్ సర్క్యూట్ కారణంగా ఓ ఇల్లు పాక్షికంగా దగ్ధమైంది. స్థానికులు, అగ్నిమాపక సిబ్బంది సకాలంలో స్పందించడంతో పెద్ద ముప్పు తప్పినట్లయింది. ?వివరాల్లోకి వెళ్తే చిట్యాల మున్సిపాలిటీ పరిధిలోని రెండో వార్డు, లక్ష్మీ గార్డెన్స్ సమీపంలో నివాసముంటున్న పాకల అంజయ్య ఇంట్లో ఒక్కసారిగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ సంభవించింది. క్షణాల వ్యవధిలోనే మంటలు ఇల్లంతా వ్యాపించాయి. ప్రమాదం జరిగిన సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది, స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ?ఇల్లు తగలబడుతుండటం గమనించిన స్థానికులు వెంటనే అప్రమత్తమై రామన్నపేట అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. సమాచారం అందిన వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. సకాలంలో మంటలను ఆర్పేయడంతో పక్కన ఉన్న ఇళ్లకు ప్రమాదం తప్పడమే కాకుండా, పెద్ద ఎత్తున ఆస్తి నష్టం జరగకుండా నివారించగలిగారు.

# పెన్షనర్లు సామాజిక సేవలో ముందుండాలి

---రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షులు రావెళ్ల సీతారామయ్య

అక్షరకలం కోదాడ



విశ్రాంత ఉద్యోగులు తమ శేషజీవితంలో సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తూ సమాజంలో అందరికీ ఆదర్శంగా నిలవాలని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు రావెళ్ల సీతారామయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం కోదాడ పట్టణంలోని పెన్షనర్ల సంఘ భవనంలో కోదాడ యూనిట్ అధ్యక్షులు వేనేపల్లి శ్రీనివాసరావు అధ్యక్షతన మే నెలలో పుట్టినరోజు జరుపుకునే విశ్రాంత ఉద్యోగుల జన్మదిన వేడుకలను సామూహికంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కేక్ కట్ చేసి విశ్రాంత ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ ఉద్యోగ విరమణ చేసినప్పటికీ సమాజంపై బాధ్యతతో పెన్షనర్లు సేవా రంగంలో ముందుకు సాగాలన్నారు. అనుభవజ్ఞులైన విశ్రాంత ఉద్యోగుల సలహాలు, సూచనలు సమాజ ప్రగతికి ఎంతగానో తోడ్పడతాయని పేర్కొన్నారు.ఈ సామూహిక వేడుకలు సభ్యుల మధ్య ఆత్మీయతను, ఐక్యతను పెంపొందిస్తాయని తెలిపారు. అనంతరం జన్మదినం జరుపుకునే పెన్షనర్లను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కోదాడ అధ్యక్షులు వేనేపల్లి శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షులు బొల్లు రాంబాబు, కోదాడ నాయక్, జెగిని షంబయ్య, తిరుపతమ్మ, పొట్ట జగన్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# ఫైర్ పై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలి ..తహసిల్దార్ సంతోష్ కిరణ్

అక్షరకలం కోదాడ



ప్రజా పాలన ప్రగతి ప్రణాళికల 99 రోజులలో భాగంగా స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో అగ్నిమాపక అధికారి కందుల డాక్టర్ బాబు ఆధ్వర్యంలో ఫైర్ పై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తహసీల్దార్ సంతోష్ కిరణ్ పాల్గొని అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు డీసీపీ, సిఓటును ఎలా ఉపయోగించాలో మాక్ డ్రిల్ ద్వారా చూయించారు. అనంతరం తహసిల్దార్ మాట్లాడుతూ మనం విధులు నిర్వహిస్తున్న కార్యాలయాలలో, మనం నివసిస్తున్న ప్రాంతాలలో అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు ఆ ప్రమాదాలను నివారించడానికి పాటించవలసిన నిబంధనలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని అన్నారు. మీరు ఎక్కడైనా అగ్ని ప్రమాదం జరుగుతున్న దాన్ని చూసినట్లయితే తక్షణమే 101 కి కాల్ చేసి ఆ అగ్ని ప్రమాదాన్ని నివారించడానికి సహకరించాలని అన్నారు. ఈ వేసవి కాలంలో అగ్ని ప్రమాదాలు ఎక్కువగా సంభవించే అవకాశాలు ఉన్నందున ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ముఖ్యంగా రైతులు పంట పొలాలలో గడ్డిని తగలబెట్టడం వలన రోడ్ల వెంబడి చెట్లు అలాగే గడ్డివాములు కొన్ని ప్రాంతాలలో ఇల్లు అగ్ని ప్రమాదానికి గురి అవుతున్నాయి కావున రైతులు పొలాలలో గడ్డిని తగలబెట్టకుండా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది రఫీ, నాగార్జున, మోహన్, జగన్, నాయకులు భాషాబోయిన భాస్కర్, ఫైర్ సిబ్బంది జి శ్రీనివాసరావు, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేసిన. తెలంగాణ రాష్ట్ర గొర్రెలు మరియు మేకలు అభివృద్ధి సహకార సమాఖ్య చైర్‌పర్సన్,గద్వాల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ సరితమ్మ.

జోగులంబ గద్వాల జిల్లా అక్షర కలం ప్రతినిధి



గద్వాల జిల్లా కేంద్రంలోని సరితమ్మ క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను తెలంగాణ రాష్ట్ర గొర్రెలు మరియు మేకలు అభివృద్ధి సహకార సమాఖ్య చైర్‌పర్సన్,గద్వాల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ సరిత తిరుపతయ్య..లి చేతులమీదుగా శుక్రవారం అందజేశారు... ప్రజలకు ఆపద సమయంలో ప్రభుత్వం అండగా నిలుస్తుందనే నమ్మకాన్ని మరోసారి చాటుతూ లబ్ధిదారులకు ఆర్థిక సహాయం కింద కేటీ దొడ్డి మండలం ఇర్కిచెడు గ్రామానికి చెందిన చెదురంగప్ప ూ/శీ గోవింద్ కి ?60,000,గద్వాల మండలం కొండపల్లి గ్రామానికి చెందిన రాఘవేంద్ర ూ/శీ కొత్తరాముడుకి ?60,000,గద్వాల మండలం పూడూర్ గ్రామానికి చెందిన బోయ ఈశ్వరమ్మ ఔ/శీ బోయ జమ్మన్నా కి ?60,000,గద్వాల మున్సిపాలిటీ రాఘవేంద్ర కాలనీకి చెందిన కృష్ణ ూ/శీ నరసింహులుకి ?52,500/- మొత్తం ?2,32,500 విలువ గల సీఎం రిలీఫ్ చెక్కులను పంపిణీ చేశారు.. అనంతరం సరితమ్మ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తోందన్నారు. పేద మరియు మధ్యతరగతి కుటుంబాలు వైద్య చికిత్సల కోసం ఆర్థిక ఇబ్బందులు పడకుండా ఉండేందుకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో ఉపయోగపడుతోందన్నారు.అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరేలా నిరంతరం కృషి చేస్తున్నామని,ప్రజల కష్టసుఖాల్లో తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని సరిత తిరుపతయ్య పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా డిసిసి జనరల్ సెక్రటరీ శెట్టి ఆత్మకూరు లక్ష్మణ్,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మధుసూదన్ బాబు,మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ లత్తిపురం వెంకట్రామిరెడ్డి,పాతపాలెం ఆనంద్ గౌడ్,కొండపల్లి రాఘవేంద్ర రెడ్డి,కుర్మన్న,డ్యాం ఆంజనేయులు,సతీష్ యాదవ్,బి.ఆర్.ఇమ్మనేయిల్,రంగస్వామి,శ్రీనివాస్ యాదవ్,లబ్ధిదారులు, నాయకులు తదితరులు ఉన్నారు.

# 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఎర్లీ చైల్డ్‌హుడ్ డెవలప్‌మెంట్.. జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్

అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, మే 29:



ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఎర్లీ చైల్డ్‌హుడ్ డెవలప్‌మెంట్ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్ తెలిపారు. శుక్రవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంచిర్యాల ప్రాజెక్టు అంగన్‌వాడీ టీచర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారి మాట్లాడుతూ, అంగన్‌వాడీ టీచర్లకు చిన్నారుల సమగ్ర అభివృద్ధిలో ఎర్లీ చైల్డ్‌హుడ్ డెవలప్‌మెంట్ ప్రాముఖ్యతతో పాటు, శిశువు జీవితంలోని మొదటి 1000 రోజుల కీలకతపై అవగాహన కల్పించడం జరిగిందని. పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలకు, మేధో వికాసానికి ఈ కాలం అత్యంత ముఖ్యమని తెలిపారు. పోషకాహార లోప నిర్మూలన, పిల్లల సమగ్ర అభివృద్ధి కోసం కృషి చేయాలని అంగన్‌వాడీ టీచర్లతో ప్రతిజ్ఞ చేయించారు. ఎర్లీ చైల్డ్‌హుడ్ డెవలప్‌మెంట్, తల్లి సంరక్షణ, పోషకాహారం, చిన్నారుల ఆరోగ్యంపై ప్రజలలో అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహించడం జరిగిందని తెలిపారు. అనంతరం కార్యక్రమం గోడప్రతులను ఆవిష్కరించి, అంగన్‌వాడీ కేంద్రాలలో ప్రదర్శించేందుకు అందజేశారు. ఈ కార్యక్రమం మంచిర్యాల ప్రాజెక్టు అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

# అవినీతిపై చర్చకు ఎమ్మెల్యే సిద్ధమా...

## -బి జె పి రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి ఓరుగంటి చంద్రశేఖర్

జగిత్యాల మే 29 (అక్షర కలం)

అవినీతిపై చర్చకు ఎమ్మెల్యే సిద్ధమా బి జె పి రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి ఓరుగంటి చంద్రశేఖర్ అన్నారు. స్థానిక ప్రెస్ క్లబ్ లో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి ఓరుగంటి చంద్రశేఖర్ ,భాజపా జిల్లా ప్రధాన కార్యదర్శి నలువాల తిరుపతి, మాట్లాడుతూ "గత 12 సంవత్సరాలుగా జగిత్యాలలో జరిగిన అవినీతిపై మీరు ప్రజల ముందుకు వచ్చి చర్చకు సిద్ధమా...? ఓపెన్ డిబేట్‌కు రావాలి" అంటూ ఎమ్మెల్యేకు సవాల్ విసిరారు.డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల నిర్మాణంలో భారీ అవినీతి జరిగిందని ఆరోపించారు. "మొదట కాంట్రాక్టర్లు మీ కమిషన్లకు భయపడి పనులు వదిలేసి వెళ్లిపోయారని, తర్వాత మీ వియ్యంకుడి ద్వారా పనులు చేయించారని విమర్శించారు.సమీకృత మార్కెట్ పేరుతో రైతుల పొట్ట కొట్టారని మండిపడ్డారు. "ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను ప్రజల మార్కెట్ కాకుండా మీ ఇంటి మార్కెట్‌గా మార్చుకున్నారు" అంటూ ఆరోపించారు. నర్సింగాపూర్ ప్రాంతంలో జరుగుతున్న మొరం అక్రమ రవాణాకు ఎమ్మెల్యే అనుచరులే కారణమని అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో జరిగిన అవినీతిపై ఎమ్మెల్యే మాట్లాడడం హాస్యాస్పదమన్నారు.మున్సిపల్ అవినీతిలో ఎమ్మెల్యే హస్తం ఉండటంతో విచారణలు ఎక్కడికక్కడే ఆగిపోయాయని విమర్శించారు. కేంద్రీయ విద్యాలయానికి స్థలం కేటాయించకుండా రాజకీయ స్వార్థంతో అడ్డంకులు సృష్టించారని ఆరోపించారు. అలాగే రైతుల సమస్యలపై ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా తప్పుబట్టారు. "రెండు నెలలుగా వరి కొనుగోలు చేయకుండా రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. మక్కల కొనుగోలు కేంద్రాల్లో చినిగిన సంచులు ఇచ్చి రైతులను అవమానిస్తున్నారు" అన్నారు.
ఒక బీసీ బిడ్డ ఎదుగుతుంటే ఎమ్మెల్యే ఓర్వలేకపోతున్నారు" అని అన్నారు. ఎంపీ ధర్మపురి అరవింద్ అభివృద్ధి కోసం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. "పసుపు బోర్డు, కేంద్రీయ విద్యాలయం వంటి అభివృద్ధి కార్యక్రమాలు తీసుకొచ్చింది బీజేపీ నాయకత్వమే" అన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భోగ శ్రావణి పై జరుగుతున్న విమర్శలను తీవ్రంగా ఖండించారు "నరేంద్ర మోడీ నాయకత్వంలో శ్రావణి నిజాయితీగా పనిచేస్తున్నారు. ఆమె ఎదుగుదలను ఓర్వలేక అవాకులు చవాకులు పేలుస్తూ రౌడీ షీటర్ల చేత విమర్శలు చేయిస్తున్నారు" అని ఆరోపించారు."మహిళ నాయకురాలిపై మాట్లాడేటప్పుడు ఆలోచించి మాట్లాడాలి. బీజేపీ మహిళా నాయకురాలు భోగ శ్రావణిపై బెదిరింపులు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. "కేసీఆర్ శిక్షణలో పెరిగిన ఎమ్మెల్యే అదే అవినీతి రాజకీయాలను ఇక్కడ అమలు చేస్తున్నారు.కానీ బీజేపీ నాయకులు నరేంద్ర మోడీ నాయకత్వంలో నిజాయితీతో పనిచేస్తున్నారు. పేదలు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే మా లక్ష్యం" అని తెలిపారు."అవినీతిపై చర్చకు సిద్ధమైతే ప్రజల సమక్షంలో ఎప్పుడైనా బహిరంగ చర్చకు రావాలి" అంటూ ఎమ్మెల్యేకు మరోసారి సవాల్ విసిరారు.
ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి పాత రమేష్, అర్బన్ మండల అధ్యక్షుడు గడ్డం రామ్ రెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శి ఆముదరాజు, ఇట్యాల రాము, పవన్ సింగ్, బందెల గంగరాజు తదితరులు పాల్గొన్నారు



# పంట అవశేషాలను కాల్చవద్దు -- నేల ఆరోగ్యాన్ని కాపాడండి;

– రైతులకు మరికల్ మండల వ్యవసాయ అధికారి విజ్ఞప్తి ;

– మండల వ్యవసాయ అధికారి రెహమాన్ ;

(అక్షర కలం, నారాయణపేట జిల్లా రిపోర్టర్, మే,29)

మరికల్ , మే 29 ; పంట కోత అనంతరం పొలాలలో మిగిలిపోయే వరి, గోధుమ, మొక్కజొన్న తదితర పంటల గడ్డి మరియు అవశేషాలను తగలబెట్టడాన్ని "పంట అవశేషాల దహనం" అంటారు. పొలాలను త్వరగా శుభ్రం చేయడానికి ఈ పద్ధతి ఉపయోగిస్తున్నప్పటికీ, ఇది నేల ఆరోగ్యం, పర్యావరణం మరియు భవిష్యత్ వ్యవసాయ ఉత్పాదకతపై తీవ్రమైన ప్రతికూల ప్రభావాలు చూపుతుందని మరికల్ మండల వ్యవసాయ అధికారి తెలిపారు. పంట అవశేషాలను ం వల్ల నేలలో ఉండే విలువైన సేంద్రియ కార్బన్ పూర్తిగా నశిస్తుంది. సేంద్రియ పదార్థం నేల సారవంతం, నీటి నిల్వ సామర్థ్యం, నేల నిర్మాణం మరియు సూక్ష్మజీవుల కార్యకలాపాలకు ఎంతో అవసరం. దీని వల్ల నేల సారహీనంగా మారి, క్రమంగా నేల నాణ్యత క్షీణిస్తుంది. అధిక ఉష్ణోగ్రతల కారణంగా నేలలో ఉండే ప్రయోజనకరమైన బ్యాక్టీరియా, శిలీంధ్రాలు, వానపాములు మరియు ఇతర సూక్ష్మ జీవులు నశిస్తాయి. ఇవి పోషకాల చక్రం, నత్రజని స్థాపన మరియు సేంద్రియ పదార్థాల విచ్ఛిన్నంలో కీలక పాత్ర పోషిస్తాయి. ఈ జీవ వ్యవస్థ దెబ్బతినడంతో నేల ఉత్పాదకత తగ్గిపోతుంది. పంట అవశేషాలను కాల్చడం వల్ల ప్రధాన పోషకాలు కూడా నష్టపోతాయి. ముఖ్యంగా నత్రజని ఎక్కువగా వాతావరణంలోకి ఆవిరైపోతుంది. గంధకం



వాయువుల రూపంలో నష్టపోతుంది. ఫాస్ఫరస్ మరియు పొటాషియం కూడా కొంత మేర నష్టపోతాయి. ఫలితంగా రైతులు అధిక మొత్తంలో రసాయన ఎరువులు వాడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. పదేపదే పంట గడ్డి కాల్చడం వల్ల నేల నిర్మాణం దెబ్బతిని, నేల గట్టిపడి కుదించుకుపోతుంది. నేల కణాల కలయిక తగ్గిపోవడంతో నీరు భూమిలోకి ఇంకే సామర్థ్యం తగ్గి, నేల కోత ప్రమాదం పెరుగుతుంది. దీని ప్రభావం వేర్ల పెరుగుదలపై కూడా పడుతుంది. సాధారణంగా పంట అవశేషాలు మల్చ్‌లా పనిచేసి నేలలో తేమను నిల్వ ఉంచుతాయి. కానీ వాటిని కాల్చడం వల్ల నేల త్వరగా ఆరిపోవడం, బాష్పీభవనం పెరగడం మరియు నీటిపారుదల అవసరం అధికమవడం జరుగుతుంది. కాల్చిన పొలాల్లో నేల ఉష్ణోగ్రత ఆకస్మికంగా పెరగడం వల్ల నేల ఉపరితల జీవావరణం దెబ్బతింటుంది. ఇది విత్తనాల మొలక, వేర్ల అభివృద్ధి మరియు పంట ఎదుగుదలపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. పంట గడ్డి కాల్చడం వల్ల వాయు కాలుష్యం, పొగమంచు మరియు గ్రీన్‌హౌస్ వాయువుల ఉద్గారం పెరుగుతుంది. ముఖ్యంగా కార్బన్ డయాక్సైడ్ (సిఒ2), మీథేన్ (సి హెచ్ 4), నైట్రస్ ఆక్సైడ్ (ఎన్2ఒ) వంటి వాయువులు విడుదలై పర్యావరణానికి హానికరంగా మారుతున్నాయి. అదేవిధంగా, మానవుల్లో శ్వాసకోశ సమస్యలు కూడా పెరిగే ప్రమాదం ఉందని తెలిపారు. రైతులు పంట అవశేషాలను కాల్చకుండా సుస్థిర పద్ధతులను అనుసరించాలని సూచించారు. మల్చింగ్ ద్వారా పంట అవశేషాలను పొలం ఉపరితలంపైనే వదిలివేయడం, కంపోస్టింగ్ ద్వారా సేంద్రియ ఎరువుగా మార్చడం, మట్టిలో కలపడం ద్వారా సేంద్రియ పదార్థాన్ని పెంచడం వంటి పద్ధతులు ఉపయోగకరమని తెలిపారు. అలాగే హ్యాపీ సీడర్, సూపర్ సీడర్ యంత్రాల వినియోగంతో పంట అవశేషాలను కాల్చకుండా విత్తనాలు వేయవచ్చని వివరించారు. బయో–డీకంపోజర్ స్ప్రేలు వాడటం ద్వారా పంట అవశేషాలు సహజసిద్ధంగా త్వరగా కుళ్లిపోతాయని సూచించారు. స్వల్పకాలంలో సమయం మరియు శ్రమ ఆదా కోసం పంట గడ్డి కాల్చడం రైతులకు ఉపయోగకరంగా కనిపించినప్పటికీ, దీని వల్ల దీర్ఘకాలంలో నేల సారవంతం, సూక్ష్మజీవుల జీవవ్యవస్థ మరియు వ్యవసాయ సుస్థిరత తీవ్రంగా దెబ్బతింటుందని మరికల్ మండల వ్యవసాయ అధికారి తెలిపారు. కాబట్టి రైతులు పంట అవశేషాలను కాల్చకుండా శాస్త్రీయ పద్ధతులను పాటించి నేల ఆరోగ్యాన్ని కాపాడాలని కోరారు.

# మక్తల్ పోలీస్ స్టేషన్ కొత్త ఎస్ఐగా పి. రాజు బాధ్యతలు

(అక్షర కలం, నారాయణపేట జిల్లా రిపోర్టర్, మే,29)



మక్తల్: మక్తల్ పోలీస్ స్టేషన్‌లో కొత్త స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా ఎస్ఐ పి. రాజు అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. ఆయన దామరగిద్ద ఎస్ఐగా విధులు నిర్వహించిన తర్వాత ఈ బాధ్యతకు బదిలీ అయ్యారు. ముందుగా మక్తల్‌లో ఎస్ఐగా ఉన్న భాగ్యలక్ష్మి రెడ్డి జిల్లా ఎస్పీ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా నూతన ఎస్ఐ పి. రాజు జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ గారిని ఎస్పీ కార్యాలయంలో పూలతో మర్యాదగా కలిశారు. జిల్లా ఎస్పీ గారు నూతన ఎస్ఐకి శుభాకాంక్షలు తెలిపారు మరియు మక్తల్ మండలం ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి శాంతి, భద్రతల పరిరక్షణకు కట్టుబడి పనిచేయాలని సూచించారు. ఎస్ఐ పి. రాజు మాట్లాడుతూ, మక్తల్ మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలకు స్నేహపూర్వక పోలీసింగ్ సేవలు అందిస్తూ, ఎలాంటి సమస్యలైనా నేరుగా పోలీస్ స్టేషన్‌కు వచ్చి తెలియజేయాలని ప్రజలకు సూచించారు. గ్రామాల్లో అక్రమ కార్యకలాపాలు, మత్తు పదార్థాల వినియోగం, పేకాటా మరియు గంజాయి రవాణా, ట్రాఫిక్ నియమాల ఉల్లంఘనలపై ప్రత్యేక నిఘా కొనసాగిస్తామని, మహిళల భద్రతకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని, యువతను చట్టవిరుద్ధ కార్యకలాపాల నుంచి దూరంగా ఉంచేందుకు చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తెలిపారు. మక్తల్ పోలీస్ స్టేషన్ తరఫున, సంబంధిత అంశాలపై స్థానిక ప్రజలతో సమావేశాలు మరియు ప్రజాసంపర్క కార్యక్రమాలు త్వరలో నిర్వహించబోతున్నట్లు ప్రకటించారు.

# మైనర్ డ్రైవింగ్‌పై మహబూబ్‌నగర్ ట్రాఫిక్ పోలీసుల ప్రత్యేక డ్రైవ్

మహబూబ్‌నగర్, మే 29. అక్షర కలం :




మైనర్‌ల డ్రైవింగ్‌ను అరికట్టేందుకు మహబూబ్‌నగర్ ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ డి. జానకి ఆదేశాల మేరకు పట్టణంలోని ప్రధాన కూడళ్లలో విస్తృత తనిఖీలు చేపట్టారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ డ్రైవ్‌లో వాహనాలు నడుపుతున్న మైనర్‌లను గుర్తించి చర్యలు తీసుకున్నారు. డ్రైవ్‌లో పట్టుబడిన మైనర్‌ల తల్లిదండ్రులను ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు పిలిపించి ప్రత్యేక కౌన్సిలింగ్ నిర్వహించారు. చిన్న వయస్సులో వాహనాలు నడపడం వల్ల సంభవించే ప్రమాదాలు, చట్టపరమైన ఇబ్బందులు, ప్రాణనష్టం వంటి అంశాలపై వారికి అవగాహన కల్పించారు. పిల్లలకు వాహనాలు ఇవ్వడం తల్లిదండ్రుల నిర్లక్ష్యంగా పరిగణించబడుతుందని పోలీసులు హెచ్చరించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ.. మైనర్ డ్రైవింగ్ సమాజానికి ప్రమాదకరమని పేర్కొన్నారు. అనుభవం లేకుండా వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు పెరిగే అవకాశముందని తెలిపారు. తల్లిదండ్రులు బాధ్యతాయుతంగా వ్యవహరించి తమ పిల్లలకు వాహనాలు ఇవ్వకుండా జాగ్రత్త పడాలని సూచించారు.

# మహిళా సాధికారతకు వేదికగా ఇందిరా మహిళా శక్తి భవన నిర్మాణం

**జిల్లా కేంద్రంలో రూ. 5 కోట్లతో ఇందిరా మహిళా శక్తి భవనం నిర్మాణ పనులు తుది దశకు...**

**నాణ్యత విషయంలో ఎలాంటి రాజీకి తావులేదు....**

**మహిళల శిక్షణకు, ఉత్పత్తుల మార్కెటింగ్‌కు ఈ భవనాన్ని ఉపయోగంలోకి తీసుకురావాలి....**

**జిల్లా కేంద్రం లో గాంధీ నగర్ ఏరియాలో తుది దశకు చేరుకున్న ఇందిరా మహిళా శక్తి భవన సముదాయ పనులను కలెక్టర్ పరిశీలన....**

**మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్.....**

మెదక్/ కొల్చారం మే 29(అక్షర కలం):-



తెలంగాణలో మహిళా సాధికారతకు వేదికగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఇందిరా మహిళా శక్తి భవన నిర్మాణ పనులను త్వరితగతిన. పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ధ్యాన్చంద్ చౌరస్తా ఏరియా దగ్గర ఉన్న గాంధీనగర్ ఏరియాలో నిర్మాణం తుది దశకు చేరుకున్న ఇందిరా మహిళా శక్తి భవన నిర్మాణ పనులసంబంధిత పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ ఈఈ నరసింహులు తో కలిసి పనుల పురోగతి, క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో రూ. 5 కోట్లతో మంజూరై ఇందిరాస్ మహిళా శక్తి భవనం నిర్మాణం చేపట్టి తుది దశకు చేరుకుందని ఇంకా మిగిలి ఉన్న పనులను వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేయాలని, మహిళల శిక్షణకు, ఉత్పత్తుల మార్కెటింగ్‌కు ఈ భవనాన్ని ఉపయోగపడేలా తీర్చిదిద్దాలని ఆదేశించారు. ఇందిరా మహిళా శక్తి భవనాల నిర్మాణంలో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేశారు. నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. భవన నిర్మాణ ప్లాన్లు, గదుల నిర్మాణం, మౌలిక వసతుల పనులను పరిశీలించిన కలెక్టర్, పనుల పురోగతిని ప్రతిరోజూ పర్యవేక్షించాలని సూచించారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు శిక్షణ, నైపుణ్యాభివృద్ధి, ఉత్పత్తుల ప్రదర్శన, మార్కెటింగ్ కార్యకలాపాలకు ఉపయోగపడే విధంగా భవనాన్ని తీర్చిదిద్దాలని సూచించారు. ఈ పరిశీలనలో పంచాయతీ రాజ్ ఈఈ నరసింహులు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# బాదేపల్లిలో హరిజనవాడ పాఠశాలకు శంకుస్థాపన

**రూ.80 లక్షలతో నూతన భవనం నిర్మాణం**

**విద్యాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి**

మహబూబ్ నగర్. జడ్చర్ల, మే 29 అక్షర కలం :





ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి అన్నారు. జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని పాత బజార్ బాదేపల్లి హరిజనవాడలో అరబిందో ఫార్మా సీఎస్ఆర్ నిధులతో నిర్మించనున్న ప్రాథమిక పాఠశాల భవనానికి శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. రూ.80 లక్షల వ్యయంతో నిర్మించనున్న ఈ పాఠశాల భవన నిర్మాణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్తాతో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు అవసరమైన మౌలిక వసతులను కల్పిస్తున్నామని తెలిపారు. సామాజిక బాధ్యతలో భాగంగా కార్పొరేట్ సంస్థలు విద్యా రంగ అభివృద్ధికి ముందుకు రావడం అభినందనీయమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేస్తున్నాయని చెప్పారు. హరిజనవాడలో నిర్మించనున్న నూతన పాఠశాల భవనం విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా మారుతుందని, భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, అరబిందో ఫార్మా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలి

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, మే 29:



రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. శుక్రవారం జిల్లాలోని హాజీపూర్ మండలం గుడిపేట, నమ్నూర్ లలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలు, ఎస్ఆర్ఎం, గాయత్రి రైస్ మిల్లులను సందర్శించి ధాన్యం కొనుగోలు, దిగుమతి ప్రక్రియలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, ప్రభుత్వం రైతు సంక్షేమంలో భాగంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతుల ఖాతాలలో నగదు జమ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ సంవత్సరం దాదాపు 1 లక్ష 60 వేల మెట్రిక్ టన్నుల వరకు ధాన్యం కొనుగోలు చేసే అవకాశం ఉందని తెలిపారు. హమాలీల సమస్యను అధిగమించేందుకు స్థానికంగా హమాలీలను తీసుకొని ధాన్యం ఎగుమతి, దిగుమతులను వేగవంతం చేయడం జరిగిందని తెలిపారు. చివరి గింజ వరకు కొనుగోలు చేయడం జరుగుతుందని, రైతులకు ఎలాంటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పెద్దపల్లి, కరీంనగర్ లలో హమాలీలతో కలిపి 2 గోదాములను ఇచ్చారని, అకాల వర్షాల నేపథ్యంలో రైతులకు నష్టం కలగకుండా ధాన్యం నిల్వ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈసారి ధాన్యం తరలించేందుకు ట్రాక్టర్లను సైతం వినియోగించుకునేలా ప్రభుత్వం అవకాశం కల్పించిందని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం దాదాపు 10 వేల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న పంటను కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అనంతరం లక్షెట్టిపేట మండల కేంద్రంలోని జై యోగేశ్వర రైస్ మిల్ ను మండల తహశీల్దార్ దిలీప్ కుమార్ తో కలిసి సందర్శించి ధాన్యం దిగుమతి, సిఎంఆర్ ప్రక్రియను పరిశీలించారు. రైతు సంక్షేమంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, కొనుగోలు కేంద్రాల నుండి రైస్ మిల్లులకు తరలించిన ధాన్యాన్ని త్వరగా దిగుమతి చేసుకోవాలని, నిర్దేశిత సిఎంఆర్ లక్ష్యాలను నిర్ణీత గడువులోగా పూర్తి చేసే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, కొనుగోలు కేంద్రాలు, రైస్ మిల్లుల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

# చివరి గింజ వరకు ధాన్యం కొనుగోలు చేస్తాం

అక్షర కలం సిద్దిపేట మే 29:

రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు పండించిన ధాన్యాన్ని చివరి గింజ వరకు కొనుగోలు చేస్తుందని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని నంగునూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ దేవులపల్లి యాదగిరి తెలిపారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా నంగునూర్ మండల వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల వ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్లు సజావుగా కొనసాగుతున్నాయని, ఇప్పటివరకు సుమారు 65 నుంచి 75 శాతం వరకు కొనుగోళ్లు పూర్తయ్యాయని వెల్లడించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందన్నారు. కొనుగోళ్లలో సమస్యలు ఉన్నాయంటూ కొందరు బీఆర్ఎస్ నాయకులు కావాలనే తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. రాజకీయ లబ్ధి కోసంరైతులనుభయాందోళనలకుగురిచేస్తున్నారని విమర్శించారు. కొన్ని కొనుగోలు కేంద్రాల్లో తలెత్తుతున్న చిన్నచిన్న సమస్యలను పెద్దదిగా చూపిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. స్థానిక ఎమ్మెల్యేగా ప్రజలకు అండగా నిలవాల్సిన సమయంలో హరీష్ రావు రాజకీయ విమర్శలకే పరిమితమవుతున్నారని ఎద్దేవా చేశారు. ఇంచార్జ్ మంత్రి వివేక్ వెంకటస్వామి చొరవతో స్థానికంగా అందుబాటులో ఉన్న గోదాములనువినియోగించుకునేలా జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేయించినట్లు తెలిపారు. రైతులు ధాన్యం నిల్వ విషయంలో ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం ముందస్తుచర్యలుచేపట్టిందన్నారుమండలంలోని ప్రతి కొనుగోలు కేంద్రంలో ఉన్న ధాన్యాన్ని చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని రైతులకు భరోసా కల్పించారు. గత సంవత్సరాలతో పోలిస్తే ఈసారి అధిక దిగుబడి వచ్చిందని, రంగనాయక సాగర్ నీటిని ముందుగానే విడుదల చేయడం వల్ల పంటలు ఎండిపోకుండా రైతులకు మేలు జరిగిందన్నారు. ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం కట్టుబడి పనిచేస్తోందని, తప్పుడు ప్రచారాలను నమ్మి రైతులు ఆందోళన చెందవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ యువజన మండల అధ్యక్షుడు బాగు శ్రీకాంత్, నాయకులు బస్వరాజు రాములు, గంగుల రవి, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.



Printed, Published and Owned by Pittala Ramakrishna, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda - 508 001.(Telangana) Printed at Pittala Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada,Nalgonda - 508 001. (Telangana) Published at Pittala Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda - 508 001.(Telangana)Editor: PITTALA RAMAKRISHNA, Cell: 9396218955